కదంతొక్కిన అంగన్‌వాడీలు

కలెక్టరేట్ ముట్టడికి యత్నం...అడ్డుకునేందుకు పోలీసుల యత్నం

ఎక్కడికక్కడ స్టాపర్లు, రోప్ పార్టీలు ఏర్పాటు...

ఇరువర్గాల తోపులాట...700 మంది అంగన్‌వాడీల అరెస్టు

తమ డిమాండ్ల సాధన కోసం గడిచిన కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న శిబిరం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు బయలుదేరిన సిబ్బందిని పోలీసులు అడుగడుగునా అడ్డుకునేందుకు యత్నించారు. కొందరిని జైలురోడ్డు జంక్షన్ వద్ద, మరికొందరి జగదాంబ జంక్షన్, కేజీహెచ్ వద్ద అరెస్టు చేశారు. అయితే పోలీసులను తప్పించుకుని వేర్వేరు మార్గాల్లో సుమారు 100 మంది కలెక్టరేట్ వద్దకు చేరుకుని గంటపాటు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు.

- Iలో



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

వైసీపీలో అయోమయం



అధికార పార్టీని ఆందోళనకు గురిచేస్తున్న సీనియర్‌ల రాజీనామాలు

- ఇప్పటికే పంచకర్ల, వంశీకృష్ణ, సీతంరాజు, దాడి గుడ్‌బై
- తర్వాత వెళ్లేది ఎవరో?
- నేతలు, కార్యకర్తల్లో చర్చ
- మరో ఇద్దరు, ముగ్గురు నియోజకవర్గ స్థాయి నాయకులు వెళతారని ప్రచారం
- ఉత్తర, దక్షిణ నియోజకవర్గాలకు చెందిన పది మంది కార్పొరేటర్లు కూడా...
- ఎన్నికలకు ముందు వరుస వలసలపై పార్టీ పెద్దల్లో కలవరం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'వైనాట్ 175' అంటూ ఇంతవరకూ డాంబికాలు పలికిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకు ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ తత్వం బోధపడుతోంది. మళ్లీ తామే అధికారంలోకి వస్తామని నిన్నమొన్నటి వరకూ ధీమా ప్రదర్శించిన నేతలంతా ఇప్పుడు పార్టీలో నుంచి ఎప్పుడెవరు వెళ్లిపోతారోనని కంగారుపడుతున్నారు. ప్రస్తుతం ఏ ఇద్దరు నేతలు కలిసినా...'నెక్ట్స్ ఎవరు?' అనే ఆరా తీసే కార్యక్రమంలో ఉంటున్నారు. మూడు నెలల కిందట మొదలైన వలసలు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పుడు వేగం పుంజుకున్నాయి. ఒకరి తర్వాత ఒకరు అన్నట్టు పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతలు పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరిపోతున్నారు.

ఎన్నికలకు మరో నాలుగు నెలలు మాత్రమే సమయం ఉండడంతో రాజకీయం వేడెక్కుతోంది. వైసీపీ ప్రభుత్వ పనితీరుపై ఉద్యోగులు, కార్మికులతోపాటు అన్ని వర్గాల్లో వ్యతిరేకత ఉందని పలు సర్వే సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నేతలు సేఫ్ జోన్‌ను

... మిగతా 6వ పేజీలో



పంచకర్ల రమేశ్‌బాబు



వంశీకృష్ణ శ్రీనివాస్



సీతంరాజు



దాడి వీరభద్రరావు

మార్చి నాటికి క్రూయిజ్ టెర్మినల్ ఆపరేషన్

- చెన్నై-విశాఖపట్నం-కొలంబో నడుమ ఒక క్రూయిజ్
- అప్పన్న భక్తుల కోసం రూ.34 కోట్లతో రహదారి విస్తరణ
- ఫిషింగ్ హార్బర్ భద్రతలో మత్స్యకారులకీ బాధ్యత
- కాలుష్యం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం
- విశాఖపట్నం పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం పోర్టులో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్‌ను ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా ఆపరేషన్‌లోకి తీసుకువస్తామని పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు తెలిపారు. పోర్టు గెస్ట్‌హౌస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో

... మిగతా 6వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

జనసేన విశాఖ అర్బన్ అధ్యక్షుడిగా వంశీకృష్ణ

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):

ఇటీవల జనసేనలో చేరిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌ను విశాఖపట్నం అర్బన్ జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బుధవారం ఆదేశాలు ఇచ్చారు. ఏడాదిపాటు వంశీకృష్ణ ఆ బాధ్యతలు నిర్వహిస్తారు. విశాఖపట్నంలో పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలని తనకు సూచించారని, పవన్‌కల్యాణ్ నమ్మకాన్ని నిలబెడతానని వంశీకృష్ణ ఈ సందర్భంగా తెలిపారు.



పవన్ కల్యాణ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న దృశ్యం

వీఆర్‌కు పెందుర్తి క్రైమ్ ఎస్ఐ

- చోరీ కేసు దర్యాప్తులో అవినీతి ఆరోపణలు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తి క్రైమ్ ఎస్ఐ సల్మాన్ బేగ్‌ను వీఆర్‌కు సరండర్ చేసినట్టు తెలిసింది. ముదపాక జగనన్న లేఅవుట్‌లోని ఆరు టన్నుల ఇనుమును చోరీ చేసి ఒక వ్యాన్‌లో తరలిస్తుండగా అక్కడి సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే ఈ కేసులో సరిగా వ్యవహరించకపోవడంతోపాటు నిందితులకు మేలు చేసేందుకు వీలుగా ఎస్ఐ డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో నగన పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ విచారణకు స్పెషల్‌బ్రాంచి అధికారులను ఆదేశించారు. అయితే స్పెషల్‌బ్రాంచి నుంచి సరైన నివేదిక అందకపోవడంతో విచారణ బాధ్యతను క్రైమ్ ఏడీసీపీ గంగాధర్‌కు అప్పగించారు. ఈ ఉదంతంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన ఏడీసీపీ ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారిస్తూ సీపీకి మంగళవారం నివేదించినట్టు తెలిసింది. క్రైమ్ ఏడీసీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐను వీఆర్‌కు సరండర్ చేయడంతోపాటు చార్జిమెమో కూడా జారీచేసినట్టు సమాచారం. ఈ కేసులో పర్యవేక్షణలోపం కింద సీఐ, ఏసీపీలకు కూడా చార్జిమెమోలు జారీచేయాలని సీపీ భావిస్తున్నట్టు పోలీస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



కేజీహెచ్‌లో కోల్డ్ వార్



అనేక విభాగాల్లో వైద్యుల మధ్య విభేదాలు

- ఇబ్బంది పడుతున్న రోగులు
- ఆరోగ్యశ్రీ కేసుల కోసం పోటీ
- అవసరమైతే రోగిని భయపెట్టి ప్రైవేటు ఆస్పత్రులకు పంపేందుకు కూడా వెనుకాడని కొంతమంది వైద్యులు
- ఆస్పత్రికి ఆర్థికంగా నష్టం
- ఉన్నతాధికారులు దృష్టి సారించడం అవసరం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేజీహెచ్‌లో వైద్యుల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. పలు విభాగాల్లో వైద్యుల వ్యవహారశైలితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. ఒక వైద్యుడితో మాట్లాడితే మరో వైద్యుడు సహించలేని స్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సిన రోగుల విషయంలో వైద్యులు పట్టింపులకు పోతుండడంతో ఇబ్బందికరంగా మారుతోంది. వైద్యులతోపాటు అక్కడ పనిచేసే సిబ్బంది కూడా వర్గాలుగా విడిపోయారు.

ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, ఆర్థో, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీతోపాటు అనేక విభాగాల్లో రెండు నుంచి ఐదుకుపైగా యూనిట్లు ఉంటాయి. ఒక యూనిట్‌లో చేరిన రోగులను మరో యూనిట్‌కు చెందిన వైద్యులు చూడరు. పొరపాటున పరిచయం ఉందని వేరొక యూనిట్ వైద్యుడితో చెప్పిస్తే...వారి అహం దెబ్బతింటుంది. 'ఈ యూనిట్ చేర్పించడం ఎందుకు?, ఆ యూనిట్‌లోనే చేర్పించకపోయారా..' అంటూ రుసరుసలాడుతుంటారు. ఆ తరువాత ఏమి అడిగినా ముక్తసరిగా సమాధానాలు వస్తుంటాయి. ఈ విభేదాలు పలు సందర్భాల్లో రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నాయి. సదరు వైద్యుడు శస్త్రచికిత్స సరిగా నిర్వహించలేడు...ఆ తరువాత మీ ఇష్టం' అంటూ రోగులను అదే విభాగానికి చెందిన వైద్యులు భయపెట్టి బయటకు వెళ్లేలా చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఉంటే మరో ఆస్పత్రిలో చేరడం మంచిది..అవసరమైన సహకారాన్ని అందిస్తామంటూ చెబుతున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయానికి అత్యంత సమీపంలో ఉండే ఓ కీలక విభాగంలో ఈ పరిస్థితి మరింత అధికంగా ఉంది. అలాగే, సీఎస్ఆర్ బ్లాక్‌కు సమీపంలో గల మరో కీలక విభాగంలోనూ ముగ్గురు వైద్యుల మధ్య విభేదాలు ఉన్నాయి. వీరి ముగ్గురూ బయటకు బాగానే మాట్లాడుకుంటూ కనిపించినా..ఒకరంటే మరొకరికి గిట్టదని, ఒకరిపై ఒకరు నిత్యం చాడీలు చెప్పుకుంటూ ఉంటారని చెబుతుంటారు. మరికొన్ని విభాగాల్లోనూ ఈ తరహా పరిస్థితి ఉందని చెబుతున్నారు.

ఆరోగ్యశ్రీ చెల్లించే డబ్బులు కోసం..

ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా కేజీహెచ్‌లో శస్త్ర చికిత్సలు నిర్వహించిన వైద్యులకు డబ్బులు వస్తాయి. వీటి కోసం వైద్యుల మధ్య అనేక విభాగాల్లో పోటీ ఉంది. శస్త్ర చికిత్స కేసులను తామే చేస్తామంటూ పోటీ పడుతుంటారు. తమకు అవకాశం రానప్పుడు రోగులను భయపెట్టేలా వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ గత్యంతరం లేని కొంతమంది ధైర్యం చేసి శస్త్ర చికిత్సలు చేయించుకుంటుండగా, మరికొందరు మాత్రం బయటకు వెళ్లిపోతున్నారు. దీనివల్ల ఆస్పత్రికి నష్టం వాటిల్లుతోంది. ఆదాయం కోల్పోతుంది. ఈ తరహా విభేదాలు అత్యంత కీలకమైన విభాగాల్లోనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లేదంటే ఇవి మరింత ముదిరి వైద్య సేవలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు నోటీసులు?


తొలుత కేజీబీవీ ఉపాధ్యాయుల తొలగింపునకు ఏర్పాట్లు

- నేడే రేపో నోటీసులు అందజేతకు నిర్ణయం
- ఆ తరువాత ఉన్నత పాఠశాలల్లో పార్ట్ టైమ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిపై దృష్టి పెట్టాలని పైనుంచి ఆదేశాలు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ పక్షం రోజుల నుంచి ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా తొలుత సమ్మెలో పాల్గొంటున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) ఉపాధ్యాయులను (సీఆర్‌టీ) తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు రెండు, మూడు రోజుల క్రితమే సూచనప్రాయంగా కేజీబీవీ ప్రిన్సిపాళ్లకు సమగ్ర శిక్షా నుంచి ఆదేశాలు వెళ్లాయి. అయినా కేజీబీవీ టీచర్లు అవేమీ పట్టించుకోకుండా ఆందోళనలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో విధులకు హాజరుకాని టీచర్లను తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల అమలుకు కసరత్తు చేస్తున్నారు. బహుశా గురు లేదా శుక్రవారం తొలగింపులకు సంబంధించి నోటీసులు అందించేందుకు నిర్ణయించారు. టీచర్లను తొలగించిన తరువాత బోధనకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. కేజీబీవీ టీచర్ల నియామకం సమయంలో మెరిట్ జాబితాలో ఇంకా వెయిటింగ్ లిస్టులో ఉన్న అభ్యర్థినులకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు. దీనికి సంబంధించి సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయాల్లో సిబ్బంది గుట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా ఉన్నత పాఠశాలల్లో పార్ట్ టైమ్ ఉపాధ్యాయులుగా పనిచేసే వారిని కూడా తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశించారని తెలిసింది. దీనికి సంబంధించి రెండు, మూడు రోజుల్లో కీలక నిర్ణయం తీసుకుంటారని ప్రచారం సాగుతుంది.



విమానాశ్రయంలో భువనేశ్వరితో టీడీపీ నేతలు

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

గోపాలపట్నం, జనవరి 3: మూడు రోజుల ఉత్తరాంధ్ర పర్యటన కోసం బుధవారం నగరానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. చంద్రబాబునాయుడు అరెస్టు సమయంలో మనస్తాపంతో ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించి సాయం అందజేస్తున్నారు. ఆమె బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖపట్నం చేరుకున్నారు. ఆమెకు మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, కిడారి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే పీ.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న, విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ఉన్న గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, గిడ్డి ఈశ్వరి, కోరాడ రాజబాబు, పార్టీ నేతలు పాశర్ల ప్రసాద్, పట్టాభి, తదితరులు స్వాగతం పలికారు.

రైల్వేలో భద్రతకు పటిష్ఠ చర్యలు: డీఆర్ఎం


పెందుర్తి స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఆర్ఎం

విశాఖపట్నం, జనవరి 3: డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ బుధవారం ప్రత్యేక తనిఖీలతో కోరుకొండ రైల్వే స్టేషన్‌లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. లెవెల్ క్రాసింగ్‌లు, ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ (వోహెచ్‌ఈ), పాయింట్లు, క్రాసింగ్‌లు, ట్రాక్ సర్క్యూట్‌లు, యార్డ్ లే అవుట్, ట్రాక్‌లు, రిలే గది తదితర భద్రతా అంశాలను పరిశీలించారు. అన్ని రిజిస్టర్లు తనిఖీతోపాటు భద్రతా పనుల అమలు తీరుపై సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. మరిన్ని భద్రతా ప్రమాణాలు పెంచడంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి పెందుర్తి స్టేషన్‌కు చేరుకుని ప్లాట్‌ఫామ్‌లు, నిరీక్షణ హాలు పునరుద్ధరణతోపాటు స్టేషన్ భవనంలో సమకూర్చాల్సిన సౌకర్యాలపై చర్చించారు.

వనితా వాకర్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

మురళీనగర్, జనవరి 3 ; గ్రేటరు 50వ వార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కు పాలక మండలి నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. రెండేళ్ల పదవీ కాలానికి గాను పొందూరు.ప్రభావతిని అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 2024 నుంచి 2026 జనవరి వరకు ఈ కొత్త కమిటీ పదవీకాలం. అలాగే, వనితా వాకర్స్‌క్లబ్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా వాకర్ మహాలక్ష్మి, సుదిత నియమితులయ్యారు. క్లబ్ కార్యదర్శిగా వాకర్ జయ, కోశాధికారిగా షీల సహా 10 మంది సభ్యులు, 8 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లను నియమించారు. మురళీనగర్ ప్రాంతంలో సామాజిక సేవల్లో భా గంగా మహిళలకు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ, వితరణలతో చేపడుతున్న వనితా వాకర్స్‌క్లబ్ సేవలను పలువురు కొనియాడారు. కొత్త కమిటీకి మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అభినందించారు.

స్పీకర్ 'తమ్మినేని'కి సన్మానం

మురళీనగర్; అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య (ఏబీసీఎఫ్) అధ్వర్యంలో బుధవారం రాత్రి మాధవధార జీవీఎంసీ కల్యాణ మండపంలో శాసన సభాపతి టి.సీతారాం దంపతులను సత్కరించారు. ఏబీసీఎఫ్, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి'

పూర్ణామార్కెట్, జనవరి 3:జీవీఎంసీలో పారిశుధ్య కార్మికుల సమ్మె తో ప్రజలనుంచి వస్తున్న వ్యతిరేకతపై వైసీపీ కార్పొరేటర్లు ఉపశమన చర్యలకు దిగారు. బుధవారం 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు నేతృత్వంలో వివిధ వార్డులకు చెందిన కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణరావు, చెన్నా జానకీరామ్, బిపిన్‌కుమార్ సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులను సూయాజ్ ఫారం వద్దకు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ, సమస్యలను ప్రభుత్వం, పార్టీ అధినేత వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

» ఎనిమిదో రోజుకు చేరిన కార్మికుల సమ్మె

» వార్డుల్లో పోగుపడుతున్న చెత్తాచెదారాలు

అక్కయ్యపాలెం, జనవరి 3: తమ డిమాండ్లు నెరవేర్చాలని జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. తమ కోర్కెలు తీర్చే వరకు విధుల్లో చేరే ప్రసక్తే లేదని కార్మికులు ఈసందర్భంగా హెచ్చరించారు. అలాగే, అన్ని వార్డుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు రహదారులపై చిందరవందరగా ఉన్నాయి. దీని వల్ల రాకపోకలు సాగించేవారు అనేక అవస్థలు పడుతున్నారు. చెత్త కుప్పలు దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోంది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు సంభవించే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పర్మినెంట్ కార్మికులు చెత్తను తొలగిస్తున్నారు.


అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో చెత్త కుప్పలు

మురళీనగర్‌లో ...

మురళీనగర్; మురళీనగర్, మాధవధార ఉడాకాలనీ, మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్త పేరుకుని రోడ్డుపైకి చేరా యి. వాహనదారులు, పాదచారులు ము క్కుమూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.


మురళీనగర్‌లో చెత్త కుప్పలు

నడిచే దారిలేదు..

సీతమ్మధార: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో ఎ క్కడిక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. నక్కవానిపాలెంలో సీసీ రోడ్డులో దారి లే కుండా స్తంభం వద్ద చెత్త వేస్తున్నారు. రాకపోకలు స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.


నక్కవానిపాలెం సీసీ రోడ్డులో..

రాజన్న ఆటోనగర్ స్థలంపై వైసీపీ నేతల కన్ను

» సీఐటీయూ నాయకుడు వై.రాజు


ఆటో నగర్‌పై వచ్చిన కథనాలను చూపుతున్న సీఐటీయూ నేతలు

జగదాంబ కూడలి, జనవరి 3: రాజన్న ఆటోనగర్ స్థలంపై వైసీపీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేశ్‌కుమార్, అవంతి శ్రీనివాసరావు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కన్నేశారని సీఐటీయూ నాయకుడు వై.రాజు ఆరోపించారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కనమాం గ్రామంలో 157.77 ఎకరాల భూమిని కేటాయించినట్టు చెప్పారు. ఈ స్థలంలో రాజన్న ఆటోనగర్ నిర్మిస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే, ఇప్పటి వరకు ఇక్కడ నిర్మాణ పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ భూమిపై వైసీపీ ముఖ్యనేతలు కన్నుపడిందని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. ఆటో మొబైల్, స్క్రాప్ వర్కర్లకు ఇక్కడ ఆటోనగర్ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఇది పూర్తికాకుండానే నగరంలో ఉన్న స్క్రాప్, ఆటో మొబైల్స్ తుక్కు వ్యాపారులను ఇక్కడినుంచి తరలించే కుట్రలు పన్నుతోందని విమర్శించారు.ఉన్నతాధికారులు రాజన్న ఆటోనగర్ నిర్మాణం పనులనుప్రారంభించి వ్యాపారులకు ఆశ్రయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు చంద్రమౌళి, కె.గణేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు


ప్రశంసా ప త్రాలతో పద్యార్చనలో ప్రతిభ చూపిన విద్యార్థులు

అక్కయ్యపాలెం, జనవరి 3: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో వందే విశ్వమాతరం పేరిట అమ్మ, నాన్న, గురువు పేరిట నిర్వహించిన పద్యార్చనలో పాల్గొన్న ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పాఠశాల హెచ్ ఎం బి.లక్ష్మీనరస ప్రశంసా పత్రాలను అందజేశారు.

నేటి నుంచి విశాఖలో కథా నాటిక పోటీలు

» అజో-విభో-కందాళం, రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ


మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ

సీతంపేట (విశాఖపట్నం), జనవరి 3: తెలుగు సాహిత్యం, సంస్కృతిని ప్రతిబింబించేలా అజో- విభో-కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీల ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు కథానాటిక పోటీలను నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోశ్యుల సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అజో-విభో 31వ వార్షికోత్సవం సందర్భంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలో పాల్గొనేందుకు మొత్తం 29 నాటికలు వచ్చాయని వాటిలో తొమ్మిదింటిని ఎంపిక చేసి, ప్రతిరోజూ మూడు ప్రదర్శనల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 7వ తేదీన 'సరిలేరు నీకెవ్వరు' పురస్కారాన్ని మల్లిపురం జగదీష్ విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని రేవూరి అనంతపద్మరావుకు, ప్రతిభామూర్తి పురస్కారాన్ని ఎల్లపు ముకుంద రామారావులకు అందజేస్తామన్నారు.

జగన్ తీరుతో అంగన్‌వాడీలకు అవస్థలు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్‌నజీర్


మాట్లాడుతున్న మహ్మద్ నజీర్

మహారాణిపేట, జనవరి 3: రాష్ట్రంలో అంగన్‌వాడీలు, మునిసిపల్ పారిశుధ్య కార్మికుల జీవితాలను సీఎం జగన్ నాశనం చేస్తున్నారని టీడీ పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు సేవలు వెలకట్టలేనివని, వారు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 23 రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వంలో చలనంలేక పోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు తెలంగాణలో కంటే రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు రూ. వెయ్యి వేతనం అధికంగా ఇస్తామని సీఎం హామీ ఇవ్వడంతో ఆయనను గెలిపించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట తప్పి, మడమ తప్పారన్నారు. అందువల్ల వారు సమ్మెకు దిగారని తెలిపారు. మరోవైపు తొమ్మిది రోజులుగా పారిశుధ్య కార్మికుల సమ్మెతో రా ష్ట్రం కంపుకొడుతుందన్నారు. నాయకులు చిన్న రహమాన్, షేక్ రహ్మతుల్లా, జఫ్రుల్లా, చింతపల్లి చినపోలారావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది సీఐలకు బదిలీ, పోస్టింగ్

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఎనిమిది మంది సీఐలకు బదిలీ, పోస్టింగ్ కల్పిస్తూ సీపీ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సీసీఎస్ 1లో పనిచేస్తున్న ఎస్.రమేష్‌ను ద్వారకా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. సిటీ వీఆర్‌లో ఉన్న సీర భాస్కరరావును కంచరపాలెం, అక్కడి సీఐ నల్లసాయిని రేంజ్ వీఆర్‌కు, సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.కాంతారావును నార్త్ ట్రాఫిక్, పి.కోటేశ్వరరావును గాజువాక ట్రాఫిక్ సీఐలుగా బదిలీ చేశారు. గాజువాక ట్రాఫిక్ సీఐ ఆర్.సత్యనారాయణరెడ్డిని రేంజ్ వీఆర్‌కు పంపించారు. సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.శ్రీనివాసరావుకు వెస్ట్ క్రైమ్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. అక్కడి సీఐ బీవీ జగన్నాథరావును రేంజ్ వీఆర్‌కు పంపించారు.

మార్చి నాటికి క్రూయిజ్ టెర్మినల్ ఆపరేషన్

... 5వ పేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ, క్రూయిజ్ షిప్‌లను నడిపే సంస్థలు మూడేళ్ల ముందుగా ప్లాన్ రూపొందించుకొని వారి రూట్లను ఖరారు చేసుకుంటాయని, అందువల్ల వెంటనే క్రూయిజ్‌లను రప్పించడానికి వీలు కాలేదన్నారు. విశాఖపట్నం నుంచి అండమాన్ వరకు, అక్కడి నుంచి దక్షిణ ఆసియా దేశాలైన థాయ్‌ల్యాండ్, మలేషియా, సింగపూర్‌లకు క్రూయిజ్ షిప్‌లను నడిపే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. చెన్నై, పూరీ, కోల్‌కతాలను కలుపుతూ ఒక టూరిస్ట్ సర్క్యూట్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. విశాఖపట్నాన్ని ప్రపంచ పర్యాటక చిత్రపటంలో ఉంచాలనేదే తమ ధ్యేయమన్నారు. చెన్నై-విశాఖపట్నం-కొలంబోకు ఒక క్రూయిజ్ నడపనున్నామని చెప్పారు.

మత్స్యకారులకూ బాధ్యత

ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదం ఎవరూ ఊహించలేదని, అక్కడి లోపాలపై నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తనతో చర్చించారని, భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే అక్కడ 50కి పైగా సీసీ టీవీ కెమెరాలు అమర్చామన్నారు. వాటిని నగర పోలీసులతో పాటు అవసరమైన ఇతర ప్రభుత్వ శాఖలకు అనుసంధానం చేసినట్టు వివరించారు. ప్రమాదాలకు దారితీసే ఏ వస్తువులను కూడా హార్బరులోకి అనుమతించకూడదని నిర్ణయం తీసుకున్నామన్నారు. హార్బరు భద్రతలో మత్స్యకారులకూ బాధ్యత ఉందని, దానిపై కూడా ఆయా సంఘాలతో చర్చించామన్నారు.

గిరి ప్రదక్షిణ కోసం రహదారి నిర్మాణం

సీతమ్మధారలో అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి కైలాసపురం మీదుగా ఎన్ఏడీ ముందున్న మారియట్ హోటల్ వరకు రహదారి విస్తరణకు రూ.34 కోట్ల పోర్టు నిధులు వెచ్చించడాన్ని ప్రశ్నించగా...అందులో పోర్టు స్వార్థం కూడా ఉందన్నారు. ప్రాథమికంగా సింహాద్రి అప్పన్న భక్తులు ఏటా గిరి ప్రదక్షిణ చేస్తున్నారని, ఆ సమయంలో రహదారులు కిక్కిరిసిపోతున్నాయని, వారి సౌకర్యార్థం ఆ మార్గం విస్తరణకు నిధులు కేటాయించామని చెప్పారు. అయితే దీనివల్ల ఆ ప్రాంతాల్లో ఉన్న పోర్టు భూముల విలువ కూడా పెరుగుతుందన్నారు.

పర్యావరణానికి పెద్దపీట

పోర్టు కాలుష్యం తగ్గించడానికి అన్నిరకాల చర్యలు చేపడుతున్నామని, లంకెలపాలెం, భీమిలి ప్రాంతాల్లో పోర్టుకు ఉన్న భూముల్లో భారీగా మొక్కల పెంపకం చేపడుతున్నామన్నారు. ఇదిలావుండగా ప్రస్తుతం 15 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా, దానిని 30 మెగావాట్లకు పెంచడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. విశాఖపట్నం బీచ్ కోతకు గురికాకుండా పటిష్ఠం చేయడానికి అవసరమైన నిధులు పోర్టు భరిస్తున్నదని, ఈ విషయంలో జీవీఎంసీ, జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. విశాఖపట్నం పోర్టు సామర్థ్యాన్ని పెంచడానికి 22 ప్రాజెక్టులు చేపట్టగా, వాటిలో నాలుగు పూర్తి కావచ్చాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

కోస్టల్ షిప్పింగ్‌కు ప్రోత్సాహం

విశాఖపట్నం పోర్టు నుంచి కోస్టల్ షిప్పింగ్‌ను ప్రోత్సహిస్తున్నామని, మొత్తం సరకు రవాణాలో ఇది 20 నుంచి 25 శాతం ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రైళ్ల ద్వారా 25 శాతం నుంచి 35 శాతం సరకు రవాణా జరుగుతోందన్నారు. రోడ్ నెట్‌వర్క్‌ను కూడా పెంచుకుంటున్నామని షీలానగర్-గాజువాక-అనకాపల్లి-పెందుర్తి మార్గాలను కూడా విస్తరిస్తున్నామని చెప్పారు. అదానీకి కేటాయించిన బెర్తును ప్రస్తుతం పోర్టు యాజమాన్యమే ఆపరేట్ చేస్తున్నదని, దాని ద్వారా గత రెండేళ్లలో రూ.80 కోట్ల వరకు ఆదాయం వచ్చిందన్నారు. అదానీ, వేదాంత సంస్థల వివాదాలు ఆర్బిట్రేషన్‌లో ఉన్నాయన్నారు.

వైసీపీలో అయోమయం

... 5వ పేజీ తరువాయి

వెతుక్కుంటున్నారు. వైసీపీ నగర అధ్యక్షుడిగా ఉన్న పంచకర్ల రమేష్‌బాబు మూడు నెలల కిందట హఠాత్తుగా పార్టీని వీడి జనసేన పార్టీలో చేరిపోయారు. కొద్దిరోజుల కిందట ఎమ్మెల్సీ వంశీకృష్ణశ్రీనివాస్ కూడా పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఆ తర్వాత రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ కూడా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించి లేఖను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పంపించారు. ఆయన టీడీపీలో చేరతారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇంకా ఏ పార్టీలో చేరలేదు. తాజాగా అనకాపల్లి జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు రత్నాకర్‌లు పార్టీకి రాజీనామా చేసి తన కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరిపోయారు. ఇప్పుడు తర్వాత వంతు ఎవరిదనే దానిపై పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు, ప్రజల్లో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. జిల్లాలోని ఒక నియోజకవర్గానికి చెందిన ఒక నేత టీడీపీతో సంప్రతింపులు జరపగా, సానుకూల స్పందన రాకపోవడంతో జనసేన వైపు చూస్తున్నట్టు తెలిసింది. అలాగే కొద్దిరోజుల కిందటి వరకూ ప్రాధాన్యం కలిగిన నామినేటెడ్ పోస్టులో కొనసాగిన నేత కూడా పార్టీని వీడిపోవడం ఖాయమని అంటున్నారు. ఏ పార్టీలోకి వెళతారనే దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వీరితోపాటు పశ్చిమ నియోజక వర్గానికి చెందిన మరో ముఖ్య నేత కూడా వైసీపీని వీడాలని దాదాపు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. దీనిపై తన అనుచరులతో ఇప్పటికే చర్చించినట్టు సమాచారం. ఆయన ఏ పార్టీలో చేరతారనే దానిపై సందిగ్ధత నెలకొంది. కానీ వ్యక్తిగత కారణాల వల్ల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేంత వరకూ అధికార పార్టీలోనే కొనసాగుతారని, ఆ తర్వాత రాజీనామా చేస్తారని అంటున్నారు. ఇదిలావుండగా పార్టీలో ద్వితీయశ్రేణి నాయకులు కూడా భారీగానే ఇతర పార్టీల్లోకి వలస వెళ్లిపోతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. తూర్పు, దక్షిణ నియోజకవర్గాల నుంచి దాదాపు పది మంది కార్పొరేటర్లు పార్టీకి గుడ్‌బై చెప్పేస్తారని వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఉత్తర నియోజకవర్గంలోని కార్పొరేటర్ ఒకరు తనకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి ఇస్తే జనసేనలో చేరతానని ఆ పార్టీ నేతల వద్ద షరతు పెట్టినట్టు తెలిసింది. పశ్చిమ నియోజకవర్గం టికెట్‌ను ఆనంద్‌కుమార్‌కు ఇస్తే తాను పార్టీని వీడిపోతానని అక్కడ ఒక కార్పొరేటర్ తన అనుచరులకు చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఇలా ఎవరు ఎప్పుడు పార్టీ నుంచి వెళ్లిపోతారో తెలియక వైసీపీ నేతలు, కార్యకర్తలుఅయోమయానికి గురవుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



కొండవాలు గ్రామాల్లో సమస్యలపై వినతి

కంచరపాలెం, జనవరి 3: జీవీఎంసీ 48వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో నెలకుని ఉన్న సమస్యలపై కార్పొరేటర్ గంకల కవిత బుధవారం కమిషనర్ సాయి కాంత్ వర్మను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బర్మాక్యాంప్, జైభారత్‌నగర్, ఇందిరానగర్, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టక స్థానికులు ఇబ్బంది పడుతున్నట్టు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రారంభించిన పనులు మధ్యలో నిలిపివేశారని వివరించారు. పలుచోట్ల వీధి దీపాలు లేక అంధకారం నెలకొంటోందన్నారు.ఈ కార్యక్రమంలో గంకల అప్పారావు పాల్గొన్నారు.

7న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం

డాబాగార్డెన్స్, జనవరి 3: ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ సదరన్ రీజియన్ అనుబంధంగా పనిచేస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశాన్ని ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు వీఎఫ్ఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ ఎల్‌బీ కాలేజీ ఆవరణలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నామన్నారు. ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చిస్తామన్నారు.

అరకు కాఫీకి అరుదైన గుర్తింపు

» 'వన్ డిస్ట్రిక్ట్...వన్ ప్రొడక్ట్' పేరిట కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో బంగారు పతకం కైవసం

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ జిల్లాల్లో ప్రాచుర్యం పొందిన ఉత్పత్తులకు 'వన్ డిస్ట్రిక్ట్...వన్ ప్రొడక్ట్' పేరిట ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అరకు కాఫీకి బంగారు పతకం లభించింది. జిల్లాల్లో ఓ ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులకు జనంలో మంచి గుర్తింపు ఉంటున్నది. దీంతో ఆయా ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో వున్న ప్రత్యేక ఉత్పత్తుల వివరాలను గత ఏడాది సెప్టెంబరులో సేకరించింది. అక్టోబరు నెలలో ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక ఉత్పత్తుల పరిశీలన జరిపింది. ఆ విధంగా గత ఏడాది అక్టోబరు 14న కేంద్ర బృందం సభ్యులు పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో పర్యటించి ఇక్కడ కాఫీ సాగు, తదితర వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావులను అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన 'వన్ డిస్ట్రిక్ట్.వన్ ప్రొడక్ట్' ఎంపిక ప్రక్రియకు దేశవ్యాప్తంగా 64 ఉత్పత్తులు రాగా, వాటిలో 14 ఉత్పత్తులకు గుర్తింపు లభించింది. వాటిలో మన రాష్ట్రం నుంచి ఎంపికైన ఆరు ఉత్పత్తుల్లో అరకు కాఫీ ఒకటి కావడం విశేషం. మన్యం కాఫీకి బంగారు పతకం లభించింది. ఈ కార్యక్రమానికి జీసీసీ ఎండీ జి.సురేశ్‌కుమార్ హాజరై కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ నుంచి 'వన్ డిస్ట్రిక్ట్.వన్ ప్రొడక్ట్' గుర్తింపు అవార్డును స్వీకరించారు.


అవార్డుతో జీసీసీ ఎండీ సురేశ్‌కుమార్

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి

డాబాగార్డెన్స్, జనవరి 3: అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలోని ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన విద్యార్థినులంతా ఓటు హక్కు పొందాలన్నారు. అతిథులు ఎస్‌డీసీ డిప్యూటీ కలెక్టర్ సీతారామమ్మూర్తి , మహారాణిపేట తహసీల్దార్ టి.ఆనందకుమార్, డిప్యూటీ తహసీల్దార్ పి.అప్పారావు మాట్లాడుతూ, ఓటరు ఐడీ ఏ విధంగా నమోదు చేసుకోవాలో వివరించారు. అధ్యాపకులు జి.జ్యోతి, బి.నాగమణి, శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి

కనకమహాలక్ష్మికి బంగారు ఆభరణాల బహూకరణ


ఈవోకు ఆభరణాలు అందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు

జగదాంబ కూడలి, జనవరి 3: కనకమహాలక్ష్మి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సైరా అప్పాని 45 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు, గొలుసులు తదితర ఆభరణాలను ఈవోకె.శిరీషకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం ప్రత్యేకంగా చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై వర్క్‌షాపు

సీతంపేట, జనవరి 3: మధురానగర్‌లోని టైనీ టోట్స్ పాఠశాలలో మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ వర్క్‌షాపును నిర్వహించారు. గురుగ్రామ్‌లోని లోటస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన పరిశోధక విద్యార్థిని ధృవికా రెడ్డి తన కమ్యూనిటీ ప్రాజెక్ట్ డియర్ జిందగీలో భాగంగా పలు అంశాలను వివరించారు. మాదక ద్రవ్యాలతో నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బస్సు యాత్ర విజయవంతం చేయాలి

అక్కయ్యపాలెం, జనవరి 3: పోర్టు ఆస్పత్రి రోడ్డులో ఈ నెల 6వ తేదీన జరగనున్న సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు కార్యకర్తలు నాయకులకు పిలుపునిచ్చారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానాలో సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అలాగే, సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, అల్ల లీలావతి శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై పెందుర్తి ఏఎస్ఐ ప్రతాపం

» సమయం మించి దుకాణాలు తెరవడంపై ఆగ్రహం

» సిబ్బందిని చితకబాదిన వైనం.. బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు

పెందుర్తి, జనవరి 3: చిరువ్యాపారులపై పెందుర్తి ఏఎస్ఐ దాష్టీకం ప్రదర్శించారు. రాత్రి సమయంమించినా దుకాణాలు తెరిచి రోడ్డుపై వ్యాపారులు నిర్వహిస్తున్నారన్న నెపంతో టిఫిన్ బండి నిర్వాహకులు, హోటల్ సిబ్బందిపై ఏఎస్ఐ విచక్షణారహితంగా లాఠీతో చితక బాదారు. దీంతో ఆయనపై బాధితులు పెందుర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివి.. ఈ ఘటనపై బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. స్థానిక పోలీసుస్టేషన్ ఏఎస్ఐ మురహరి మంగళవారం నైట్‌రౌండ్స్ డ్యూటీ చేశారు. ఈక్రమంలో రాత్రి 11.30 గంటలు స మయంలో జంక్షన్ రోడ్డుని ఆనుకునిఉన్న మూడు టిఫెన్, భోజన హోటల్స్ తెరచికుని వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ఏఎస్ఐ అక్కడికి చేరుకుని వ్యాపార సమయం పూర్తవుతున్నా హోటల్స్ బంద్ చేయరా ? అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. పక్కపక్కనే ఉన్న హోటల్స్ సిబ్బం దిని కిందకులాగి, మెడపట్టుకుని తోసేశారు. షట్టర్లు దించేశామని, షాపులు మూసేస్తున్నామని సిబ్బంది బతిమిలాడిన ఎఎస్ఐ అసభ్యపదజాలంతో వారిని దూషించారు. అంతటితో ఆగకుండా లాఠీతో విచక్షణారహితంగా బాదారు. వీపు, మోకాలు, పాదాలు విరిగేలా దాడి చేసినట్లు బా ధితులు వాపోతున్నారు. మహిళా సిబ్బంది అని చూడకుండా వారిపైనా చేయిచేసుకున్నట్టు బాధితులు ఆరోపించారు. ఏఎస్ఐ అరాచకం అంతా హోటల్స్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీలో నమోదైంది.

గాయాలైన హోటల్ సిబ్బంది వెంటనే స్థానిక సీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడి వైద్యులు పోలీసు ఫిర్యాదు లేదని వైద్యం చేసేందుకు నిరాకరించారనిబాధితులు తెలిపారు. ఈ స్థితిలో బుధవారం ఉదయం హోటల్స్ యాజమానులు గాయపడ్డ సిబ్బందిని తీసుకువెళ్లినా వీలుకాదని చెప్పారు. దీంతో సీసీ ఫుటేజీలో పోలీసుల దాడి చూపించడంతో వైద్యులు గాయపడిన వారికి వైద్యం చేశారు. అనంతరం బాధితులు తవుడమ్మ, సతీశ్, మల్ల ప్రసాదరావుస్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ దాడిని ఆధారాలతో నగర పోలీసు కమిషనర్‌కు నివేదించామని శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ మరిడాన శ్రీనివాసరావు తెలిపారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

సావిత్రిబాయి పూలేకు నివాళి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3: సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ నాయకుల ఆధ్వర్యంలో కర్మాగారంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ మహిళలకు విద్య విశిష్టతను వివరించి విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ఆమె చేసిన కృషి విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, రాజు, పూర్ణచంద్రరావు, వి.ప్రసాద్, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: సంఘ సంస్కర్త, మనదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బందం అప్పలరాజు, హెచ్ఎం కృష్ణారావు, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రగ్గులు అందజేత

కూర్మన్నపాలెం, జనవరి 3: కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లయన్స్ జిల్లా గవర్నర్ ఎ.గోపాలరావు మాట్లాడుతూ పేదలకు సేవలందించడంలో లయన్స్ క్లబ్‌లు ముందుంటాయన్నారు. అలాగే భరత్‌నగర్‌లో, కణితి హైస్కూల్‌లో సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎ.మురళీధరరెడ్డి, కేవీ సుబ్బరాజు, కేవీ ప్రసాద్, ఎ.సూర్యనారాయణ, కె.శంకరరావు, మూర్తి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

గాజువాక, జనవరి 3: ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాకలో బుధవారం నిర్వహిచిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నందున ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఆరోగ్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణమే వైద్యులను సంప్రందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3: కరోనా మళ్లీ ఉధృతమవుతున్న నేపథ్యంలో ఉద్యోగులతో పాటు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఉక్కు ఆస్పత్రి వైద్యులు సూచించారు. కోవిడ్ నిబంధనలపై ఉక్కు యాజమాన్యం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని, అందువల్ల అందరూ తగిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఆరోగ్యపరంగా ఏమైనా ఇబ్బందులుంటే ఉక్కు ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని కోరారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



గణపతికి హారతులిస్తున్న అర్చకులు

పెందుర్తి, జనవరి 3: పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. బుధవారం శిఖరం దిగువన గల క్షేత్రపాలకుడు గణపతికి పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామున భక్తులు సామూహిక తిరుప్పావై పారాయణం పఠించారు. గోదాదేవికి కుంకుమ పూజలు చేశారు. గోదాదేవి పాశురాన్ని స్వామికి నివేదించారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 24, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 54, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 52, బీరకాయలు 50, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 28, క్యాబేజ్ 20, క్యారెట్ 44, దొండకాయలు 36, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 100, బరబాటి 50, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 44, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 38, ఆగాకర 84, పొటల్స్ 56, కీరదోస 24, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 42, చిలగడదుంపలు 24 , కంద 50, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	80
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

పలుచోట్ల 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' నిర్వహణ



87వ వార్డు దుగ్గపువానిపాలెంలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రదర్శిస్తున్న బొండా జగన్, తదితరులు

కూర్మన్నపాలెం, జనవరి 3: ప్రజలను అన్నివిధాల తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ కోరారు. 87వ వార్డు పరిధి దుగ్గపువానిపాలెంలో బుధవారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ప్రజలకు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. ప్రజలకు మంచి భవిష్యత్తు కావాలంటే టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీవీ అప్పారావు, ఎస్ఎస్ విజయరామరాజు, శంకర్, వి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో..

జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క చాన్స్ అంటూ సీఎం అయిన జగన్ హయాంలో రాష్ట్రం అథోగతిపాలైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, రుక్మిణి, వీరభద్రరావు, గోవింద్, లోకేశ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధి అప్పికొండవారి చేలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, కక్ష సాధింపు చర్యలే తప్పా అభివృద్ధి లేదన్నారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. భవిష్యత్తులో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం రాజు, అక్కిరెడ్డి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారానికి ఊపిరి పోయండి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జనవరి 3: ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించి ఊపిరి పోయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,056వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ఊపిరిని ఆపేందుకు కేంద్రం ఎన్ని అవాంతరాలు సృష్టిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పీఎం మోదీ విధానాలపై కార్మికులంతా సమష్టిగా పోరాడి జాతి సంపదైన స్టీల్ ప్లాంటును కాపాడుకుంటామని పేర్కొన్నారు.

నాయకుడు జె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణ ప్రకియను ఉపసంహరించుకునేలా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ రంగాలే ప్రజలకు కల్పతరువులన్నారు. ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా కేంద్రం చోద్యం చూస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, కేఎస్ఎన్ రావు, నమ్మి సింహాద్రి, సన్యాసిరావు, పరంధామయ్య, గంగవరం గోపి, వేములపాటి ప్రసాద్, ఆనంద్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికుల ధర్నా

గాజువాక, జనవరి 3: జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమ్మెలో భాగంగా బుధవారం గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ధూంధాం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పారావు, రాము, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

350 మందితో పారిశుధ్య పనులు

గాజువాక జోన్ పరిధిలో పారిశుధ్య పరిస్థితిని చక్కదిద్దేందుకు గాను బుధవారం పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వివిధ కర్మాగారాలకు చెందిన సుమారు 350 మంది కార్మికులు తొలగించారు. ఇప్పటికే జోన్ పరిధిలో సుమారు 60 మంది పర్మినెంట్ సిబ్బంది, 140 మంది ప్రైవేటు కార్మికులతో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. అయితే వీరు పారిశుధ్య పనులను పూర్తి స్థాయిలో నిర్వహించలేకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలుగా పేరుకుపోయాయి. ఈ తరుణంలో వివిధ కర్మాగారాల సిబ్బందిని తీసుకువచ్చి పనులు చేపడుతున్నారు. కాగా సమ్మెలో ఉన్న కార్మికుల నుంచి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పారిశుధ్య పనులను జెడ్సీ పి.సింహాచలం పర్యవేక్షించారు.

నూతన సీజీఎంకు ఇంటక్ నాయకుల అభినందనలు



సీజీఎంకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3: స్టీల్ ప్లాంట్ సీజీఎం (వర్క్స్)గా నియమితులైన పీఎస్ రావును ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సమస్యలు, ప్లాంట్ ప్రగతి, వేతన సవరణ, భద్రత వంటి అంశాలపై సీజీఎంతో చర్చించారు. సంస్థ ప్రగతి కోసం యాజమాన్యం చేపట్టే చర్యలకు పూర్తి సహకారాన్ని అందిస్తామని కార్మిక నాయకులు పేర్కొన్నారు. నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, నాయక్, బీఎన్ రాజు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలకు గేటు పాసులు ఇవ్వాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులకు ఆరు నెలల వ్యవధితో కూడిన గేటు పాసులు ఇవ్వాలని కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు సక్రమంగా పీఎఫ్ సేవలు అందేలా చూడాలని వేడుకున్నారు.

నిరసనల మధ్య చెత్త తరలింపు

వేపగుంటలో కార్మికులు, అధికారుల మధ్య వాగ్వాదం



వేపగుంట బీసీకాలనీలో పోలీసుల సహకారంతో చెత్తను తరలిస్తున్న దృశ్యం

వేపగుంట జనవరి 3: గ్రేటర్ 94వ వార్డులో ప్రధాన కూడళ్లలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు పోలీసులు సహకారం తీసుకున్నారు. వేపగుంట బీసీకాలనీ, నాలుగురోడ్ల కూడలి పరిసర ప్రాంతాల్లో చెత్తను లారీల్లో తరలించేందుకు ప్రయత్నించారు. వేపగుంట బీసీకాలనీ వద్ద పారిశుధ్య సిబ్బంది అడ్డుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయడు, అధికారులతో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు వచ్చి కార్మికులను సముదాయించారు. ఆనంతరం చెత్తను ప్రైవేట్ వాహనాల్లో తరలించారు.

మల్కాపురంలోనూ అదే తంతు

మల్కాపురం: పారిశుధ్య కార్మికులు చేపడుతున్నసమ్మె రోజురోజుకు ఉద్రిక్తంగా మారుతోంది. మల్కాపురం ప్రధాకూడలిలో ఉన్న డంపింగ్ బిన్ వద్ద నిరసన చేపడుతున కార్మికుల వద్దకు బుధవారం పోలీసులు చేరుకున్నారు. అక్కడి చెత్తను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు చేపడుతున్న చర్యలను అడ్డుకోవద్దని పారిశుధ్య కార్మికులకు కోరారు. ఇందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పలువురు పారిశుధ్యకార్మికులు తాము సమస్యలపై సమ్మె చేస్తుంటే ఇలా అణచివేయడం దారుణమని వాపోయారు.

ఉపాధి కల్పనకు నూతన ఆవిష్కరణలు చేయాలి

ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్



ఇన్‌స్పైర్ 2కే 2024 ప్రోమోను ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ స్టీఫెన్, అధ్యాపకులు

పెందుర్తి, జనవరి 1: విద్యార్థులు యువతకు ఉపాధికి కల్పించే నవీన ఆవిష్కరణలు రూపొందించాలని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ అనారు. గోపాలపట్నంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలోని బీబీఏ విద్యార్థుల సౌజన్యంలో బుధవారం సుజాతనగర్‌లో నిర్వహించాలని ఇన్‌స్పైర్- 2కే 2024 రాష్ట్రస్థాయి సదస్సును ముఖ్యఅతిథిగా ఏయూ రిజిస్ట్రార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉద్యోగ సాధనతో లక్ష్యం పూర్తయిందని భావించకుండా పదిమందికి ఉపాధి కల్పించేలా భవిష్యత్‌ను మలచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పరిశ్రమల స్థాపనపై నవీన ఆవిష్కరణ ప్రోమోను అతిథులు ఆవిష్కరించారు. హెచ్ఆర్ మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, సెక్రటరీ సుగుణారెడ్డి, మేనేజర్ రామకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

7న బీసీ సామాజిక చైతన్యయాత్ర

ఎన్.ఎ.డి. జంక్షన్ జనవరి 3: విశాఖనగరంలో ఈ నెల 7న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ సామాజిక చైతన్య సభకు సంబంధించిన పోస్టర్‌ను పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ్ రమేష్ ఆవిష్కరించారు. బుధవారం బుచ్చిరాజుపాలెం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఈ సభ విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లుపై చర్చించారు. ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి వర్గ సభ్యులు, డాక్టర్ లక్ష్మన్, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు హజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతిగంట్ల సుబ్బరాయుడు, పొలిమేర శ్రీనివాసరావు, పల్లి శ్రీనివాస్, వలిరెడ్డి శ్రీనివాసరావు, చల్ల మంజుల, జ్యోతి, అప్పలరాజు, నరసింగరావు పాల్గొన్నారు.

సామాజిక పించన్ల పంపిణీ

మల్కాపురం, జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మూడువేలరూపాయల సామాజిక పెన్షన్‌ను పారిశ్రామిక ప్రాంతంలో పలు వార్డులలో బుధవారం అందజేశారు. 58వ వార్డులో వార్డు వైసీపీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు (పొడువు రాజు) ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పాల్గొన్నారు.


శారదా పీఠాధిపతిని కలిసిన ఎన్ఎంయూ నేత



స్వరూపానందేంద్ర సరస్వతితో ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

వేపగుంట జనవరి 3: విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేద్ర సరస్వతి స్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాతానందేంద్ర సరస్వతి స్వామిని ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ప్రగతి, ఇతర సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, రాష్ట్ర కార్యదర్శి పి.పి.ఎం. రాజు, జోనల్ కార్యదర్శి ఎమ్.వి.ఆర్.మూర్తి, జోనల్ చైర్మన్ సూర్యం, రీజనల్ అధ్యక్షుడు గండి రామకృష్ణ, కార్యదర్శి ఎ.కె. శివాజి, సింహాచలం డిపో అధ్యక్షుడు నాయుడు, శంకర్రావు, ఆర్.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షతలు పంపిణీ



అక్షతలు అందిస్తున్న బీజేపీ నాయకులు

వేపగుంట జనవరి 3: జీవీఎంసీ 94వ వార్డు శేనాతివానిపాలెంలో రామమజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, విశ్వహిందూపరిషత్, ఆధ్వర్యంలో అయోధ్య రాముని అక్షతలు, ప్రచార కరపత్రాలు బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్‌లు అయోధ్య ఆలయ నిర్మాణ ప్రాశస్త్యంను వివరించారు. షిర్డీసాయి ఆలయ నిర్వాహకులు బొబ్బర నరసింహనాయుడు, గోకాడ అప్పారావు, సుబ్రహ్మణ్యం, శ్రీను పట్నాయక్ పాల్గొన్నారు.

వార్డుల వారీగా వైసీపీ అధ్యక్షుల నియామకం

మల్కాపురం, జనవరి 3 : పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఏడువార్డులకు వైసీపీ నూతన అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం ఖరారుచేసింది. రెండురోజుల కిందట పార్టీ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, పరిశీలకులు గొంతిన నాగేశ్వరరావు పలువురి పేర్లను ప్రకటించారు. 58వ వార్డుకు దాట్ల శ్రీనివాసరాజు, 59వ వార్డుకు రేవల సత్యనారాయణ, 60వ వార్డుకు ఆడారి హరీశ్, 61వ వార్డుకు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, 62వ వార్డుకు భీశెట్టి గణేష్, 63వ వార్డుకు సోమాదుల సురేశ్, 40వ వార్డు వరపుల మహేశ్ లను నియమించారు. వీరి పేర్లను అధిష్ఠానం ఖరారుచేసింది.

టీడీపీ- జనసేనలతో సంక్షేమ పాలన

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జనవరి 3: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనలు రాష్ట్రంలో ఉమ్మడిగా అధికారంలోకి వచ్చి అన్ని వర్గాలకు సంక్షేమ పాలనను అందించనున్నట్టు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గ్రేటర్ 92వ వార్డు వెంకటాపురంలోని నందమూరినగర్‌లో వార్డు బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గణబాబు మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో చేర్చిన అంశాలను ప్రజలకు తెలియజేస్తున్నామని అన్నారు. మహాశక్తి, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాత పథకాలతో పాటు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందించే విధంగా చంద్రబాబు నాయుడు ప్రణాళిక రూపొందించారని అన్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం, జనసేన బలపరిచిన అభ్య ర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితుల కోసం పోరాడిన నేత భూలోకరెడ్డి: ఎమ్మెల్యే నాగిరెడ్డి



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, తదితరులు

పెదగంట్యాడ, జనవరి 3: ఉక్కు నిర్వాసితుల ఉపాధి కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడిన నేత పులి భూలోకరెడ్డి అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పెదగంట్యాడ కూడలిలో బుధవారం ఉక్కు నిర్వాసితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పులి భూలోకరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్-నంబర్ల జారీలో, అర్హులకు స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాల కల్పనలో నిర్వాసితుల పక్షాన భూలోకరెడ్డి నిలిచారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం చేసేందుకు భూలోకరెడ్డి నిష్పక్షపాతంగా వ్యవహరించారన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కాకి గోవిందరెడ్డి, గంధం శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, దల్లి గోవిందరెడ్డి, మొల్లి ముత్యాలు, పులి లక్ష్మీబాయితో పాటు పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రసన్నగిరిపై వేంకటేశ్వరస్వామికి దీపార్చన



నరసింహావతారంలో శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 3: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వెంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన దీపా పాశురంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శ్రీవారిని నరసింహావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు దీపాలను వెలిగించి స్వామి వారికి దీపార్చన చేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు పూజలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అర్చకులు 18వ పాశురాన్ని చదివి వినిపించారు. పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి, స్థానిక నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, కనకభవానీ, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య అక్షతలు పంపిణీ

కూర్మన్నపాలెం, జనవరి 3: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో బుధవారం ఇంటింటికీ అయోధ్య అక్షతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామభక్తులు ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలు, అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను అందజేశారు. బీజేపీ నాయకులు బొండా జగన్, బొండా ఎల్లాజీలు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో అందరూ తమ ఇళ్లలో పూజలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొండా శ్రీదేవి, బొండా గోవిందరాజులు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిభాయి పూలే స్ఫూర్తి ప్రదాత



సావిత్రిభాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

గోపాలపట్నం, జనవరి 3: ప్రముఖ సంఘ సంస్కర్త, దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ వద్ద గురుకుల పాఠశాలలో విదసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. మృదుల మాట్లాడుతూ.. మహిళలకోసం ప్రత్యేక పాఠశాలలు నిర్వహించి వారిని విద్యావంతులను చేసిన మహనీయురాలు సావిత్రి భాయి పూలే అని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. వి దసం సంస్థ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్ఎస్‌టీఎల్ ఓబీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సభ్యులు నివాళులర్పించారు. ఎస్ఎస్‌టీఎల్ ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షులు చైతన్య స్వామాట్, కార్యదర్శి గౌరవ్ ప్రజాపతి పాల్గొన్నారు.

ఎన్.ఎడీ జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ క్యాంపు కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చి త్రపటానికి శ్రీధర్ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మారుతి, కృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి..

వేపగుంట జనవరి 3: నరవ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. నరవ, జెర్రిపోతులపాలెం, చింతగట్ల, ఇప్పిలివానిపాలెం, నందవానిపాలెం తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైల్వేలో భద్రతకు పటిష్ఠ చర్యలు: డీఆర్ఎం



పెందుర్తి స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఆర్ఎం

విశాఖపట్నం, జనవరి 3: డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ బుధవారం ప్రత్యేక తనిఖీలతో కోరుకొండ రైల్వే స్టేషన్‌లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. లెవెల్ క్రాసింగ్‌లు, ఓవర్ హెడ్ ఎక్యూప్‌మెంట్ (ఓహెచ్‌ఈ), పాయింట్లు, క్రాసింగ్‌లు, ట్రాక్ సర్క్యూట్‌లు, యార్డ్ లే అవుట్, ట్రాక్‌లు, రిలే గది తదితర భద్రతా అంశాలను పరిశీలించారు. అన్ని రిజిస్టర్లు తనిఖీతోపాటు భద్రతా పనుల అమలు తీరుపై సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. మరిన్ని భద్రతా ప్రమాణాలు పెంచడంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి పెందుర్తి స్టేషన్‌కు చేరుకుని ప్లాట్‌ఫామ్‌లు, నిరీక్షణ హాలు పునరుద్ధరణతోపాటు స్టేషన్ భవనంలో సమకూర్చాల్సిన సౌకర్యాలపై చర్చించారు.

వనితా వాకర్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

మురళీనగర్, జనవరి 3 ; గ్రేటరు 50వ వార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కు పాలక మండలి నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. రెండేళ్ల పదవీ కాలానికి గాను పొందూరు.ప్రభావతిని అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 2024 నుంచి 2026 జనవరి వరకు ఈ కొత్త కమిటీ పదవీకాలం. అలాగే, వనితా వాకర్స్‌క్లబ్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా వాకర్ మహాలక్ష్మి, సుధిత నియమితులయ్యారు. క్లబ్ కార్యదర్శిగా వాకర్ జయ, కోశాధికారిగా షీల సహా 10 మంది సభ్యులు, 8 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లను నియమించారు. మురళీనగర్ ప్రాంతంలో సామాజిక సేవల్లో బా గంగా మహిళలకు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ, వితరణలతో చేపడుతున్న వనితా వాకర్స్‌క్లబ్ సేవలను పలువురు కొనియాడారు. కొత్త కమిటీకి మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అభినందించారు.

స్పీకర్ 'తమ్మినేని'కి సన్మానం

మురళీనగర్; అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య (ఏబీసీఎఫ్) అధ్వర్యంలో బుధవారం రాత్రి మాధవధార జీవీఎంసీ కల్యాణ మండపంలో శాసన సభాపతి టి.సీతారాం దంపతులను సత్కరించారు. ఏబీసీఎఫ్, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి'

పూర్ణామార్కెట్, జనవరి 3:జీవీఎంసీలో పారిశుధ్య కార్మికుల సమ్మె తో ప్రజలనుంచి వస్తున్న వ్యతిరేకతపై వైసీపీ కార్పొరేటర్లు ఉపశమన చర్యలకు దిగారు. బుధవారం 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు నేతృత్వంలో వివిధ వార్డులకు చెందిన కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణరావు, చెన్నా జానకీరామ్, బిపిన్‌కుమార్ సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులను సూయాజ్ ఫారం వద్దకు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ, సమస్యలను ప్రభుత్వం, పార్టీ అధినేత వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- ఎనిమిదో రోజుకు చేరిన కార్మికుల సమ్మె
- వార్డుల్లో పోగుపడుతున్న చెత్తాచెదారాలు

అక్కయ్యపాలెం, జనవరి 3: తమ డిమాండ్లు నెరవేర్చాలని జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. తమ కోర్కెలు తీర్చే వరకు విధుల్లో చేరే ప్రసక్తే లేదని కార్మికులు ఈసందర్భంగా హెచ్చరించారు. అలాగే, అన్ని వార్డుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు రహదారులపై చిందరవందరగా ఉన్నాయి. దీని వల్ల రాకపోకలు సాగించేవారు అనేక అవస్థలు పడుతున్నారు. చెత్త కుప్పలు దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోంది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు సంభవించే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పర్మినెంట్ కార్మికులు చెత్తను తొలగిస్తున్నారు.



అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో చెత్త కుప్పలు

మురళీనగర్‌లో ...

మురళీనగర్; మురళీనగర్, మాధవధార ఉడాకాలనీ, మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్త పేరుకుని రోడ్డుపైకి చేరా యి. వాహనదారులు, పాదచారులు ము క్కుమూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.



మురళీనగర్‌లో చెత్త కుప్పలు

నడిచే దారిలేదు..

సీతమ్మధార: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో ఎ క్కడిక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. నక్కవానిపాలెంలో సీసీ రోడ్డులో దారి లే కుండా స్తంభం వద్ద చెత్త వేస్తున్నారు. రాకపోకలు స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.



నక్కవానిపాలెం సీసీ రోడ్డులో..

రాజన్న ఆటోనగర్ స్థలంపై వైసీపీ నేతల కన్ను

- సీఐటీయూ నాయకుడు వై.రాజు

జగదాంబ కూడలి, జనవరి 3: రాజన్న ఆటో నగర్ స్థలంపై వైసీపీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేశ్‌కుమార్, అవంతి శ్రీనివాసరావు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కన్నేశారని సీఐటీయూ నాయకుడు వై.రాజు ఆరోపించారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కనమాం గ్రామంలో 157.77 ఎకరాల భూమిని కేటాయించినట్టు చెప్పారు. ఈ స్థలంలో రాజన్న ఆటోనగర్ నిర్మిస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే, ఇప్పటి వరకు ఇక్కడ నిర్మాణ పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ భూమిపై వైసీపీ ముఖ్యనేతలు కన్నుపడిందని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. ఆటో మోబైల్, స్క్రాప్ వర్కర్లకు ఇక్కడ ఆటోనగర్ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఇది పూర్తికాకుండానే నగరంలో ఉన్న స్క్రాప్, ఆటో మోబైల్స్ తుక్కు వ్యాపారులను ఇక్కడినుంచి తరలించే కుట్రలు పన్నుతోందని విమర్శించారు.ఉన్నతాధికారులు రాజన్న ఆటోనగర్ నిర్మాణం పనులనుప్రారంభించి వ్యాపారులకు ఆశ్రయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు చంద్రమౌళి, కె.గణేశ్ పాల్గొన్నారు.



ఆటో నగర్‌పై వచ్చిన కథనాలను చూపుతున్న సీఐటీయూ నేతలు

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా ప త్రాలతో పద్యార్చనలో ప్రతిభ చూపిన విద్యార్థులు

అక్కయ్యపాలెం, జనవరి 3: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో వందే విశ్వమాతరం పేరిట అమ్మ, నాన్న, గురువు పేరిట నిర్వహించిన పద్యార్చనలో పాల్గొన్న ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పాఠశాల హెచ్ ఎం బి.లక్ష్మీనరస ప్రశంసా పత్రాలను అందజేశారు.

నేటి నుంచి విశాఖలో కథా నాటిక పోటీలు

- అజో-విభో-కందాళం, రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ

సీతంపేట (విశాఖపట్నం), జనవరి 3: తెలుగు సాహిత్యం, సంస్కృతిని ప్రతిబింబించేలా అజో- విభో-కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీల ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు కథానాటిక పోటీలను నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోశ్యుల సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అజో-విభో 31వ వార్షికోత్సవం సందర్భంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలో పాల్గొనేందుకు మొత్తం 29 నాటికలు వచ్చాయని వాటిలో తొమ్మిదింటిని ఎంపిక చేసి, ప్రతిరోజూ మూడు ప్రదర్శనల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 7వ తేదీన 'సరిలేరు నీకెవ్వరు' పురస్కారాన్ని మల్లిపురం జగదీష్, విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని రేవూరి అనంతపద్మరావుకు, ప్రతిభామూర్తి పురస్కారాన్ని ఎల్లపు ముకుంద రామారావులకు అందజేస్తామన్నారు.



మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ

జగన్ తీరుతో అంగన్‌వాడీలకు అవస్థలు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్‌నజీర్

మహారాణిపేట, జనవరి 3: రాష్ట్రంలో అంగన్‌వాడీలు, మునిసిపల్ పారిశుధ్య కార్మికుల జీవితాలను సీఎం జగన్ నాశనం చేస్తున్నారని టీడీ పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు సేవలు వెలకట్టలేనివని, వారు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 23 రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వంలో చలనంలేక పోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు తెలంగాణలో కంటే రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు రూ. వెయ్యి వేతనం అధికంగా ఇస్తామని సీఎం హామీ ఇవ్వడంతో ఆయనను గెలిపించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట తప్పి, మడమ తప్పారన్నారు. అందువల్ల వారు సమ్మెకు దిగారని తెలిపారు. మరోవైపు తొమ్మిది రోజులుగా పారిశుధ్య కార్మికుల సమ్మెతో రా ష్ట్రం కంపుకొడుతుందన్నారు. నాయకులు చిన్న రహమాన్, షేక్ రహ్మతుల్లా, జఫ్రుల్లా, చింతపల్లి చినపోలారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహ్మద్ నజీర్

ఎనిమిది మంది సీఐలకు బదిలీ, పోస్టింగ్

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఎనిమిది మంది సీఐలకు బదిలీ, పోస్టింగ్ కల్పిస్తూ సీపీ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సీసీఎస్ 1లో పనిచేస్తున్న ఎస్.రమేష్‌ను ద్వారకా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. సిటీ వీఆర్‌లో ఉన్న సీర భాస్కరరావును కంచరపాలెం, అక్కడి సీఐ నల్లసాయిని రేంజ్ వీఆర్‌కు, సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.కాంతారావును నార్త్ ట్రాఫిక్, పి.కోటేశ్వరరావును గాజువాక ట్రాఫిక్ సీఐలుగా బదిలీ చేశారు. గాజువాక ట్రాఫిక్ సీఐ ఆర్.సత్యనారాయణరెడ్డిని రేంజ్ వీఆర్‌కు పంపించారు. సిటీ వీఆర్‌లో ఉన్న ఎన్.శ్రీనివాసరావుకు వెస్ట్ క్రైమ్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. అక్కడి సీఐ బీవీ జగన్నాథరావును రేంజ్ వీఆర్‌కు పంపించారు.

మార్చి నాటికి క్రూయిజ్ టెర్మినల్ ఆపరేషన్

... 5వ పేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ, క్రూయిజ్ షిప్‌లను నడిపే సంస్థలు మూడేళ్ల ముందుగా ప్లాన్ రూపొందించుకొని వారి రూట్లను ఖరారు చేసుకుంటాయని, అందువల్ల వెంటనే క్రూయిజ్‌లను రప్పించడానికి వీలు కాలేదన్నారు. విశాఖపట్నం నుంచి అండమాన్ వరకు, అక్కడి నుంచి దక్షిణ ఆసియా దేశాలైన థాయ్‌ల్యాండ్, మలేషియా, సింగపూర్‌లకు క్రూయిజ్ షిప్‌లను నడిపే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. చెన్నై, పూరీ, కోల్‌కతాలను కలుపుతూ ఒక టూరిస్ట్ సర్క్యూట్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. విశాఖపట్నాన్ని ప్రపంచ పర్యాటక చిత్రపటంలో ఉంచాలనేదే తమ ధ్యేయమన్నారు. చెన్నై-విశాఖపట్నం-కొలంబోకు ఒక క్రూయిజ్ నడపనున్నామని చెప్పారు.

మత్స్యకారులకూ బాధ్యత

ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదం ఎవరూ ఊహించలేదని, అక్కడి లోపాలపై నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తనతో చర్చించారని, భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే అక్కడ 50కి పైగా సీసీ టీవీ కెమెరాలు అమర్చామన్నారు. వాటిని నగర పోలీసులతో పాటు అవసరమైన ఇతర ప్రభుత్వ శాఖలకు అనుసంధానం చేసినట్టు వివరించారు. ప్రమాదాలకు దారితీసే ఏ వస్తువులను కూడా హార్బరులోకి అనుమతించకూడదని నిర్ణయం తీసుకున్నామన్నారు. హార్బరు భద్రతలో మత్స్యకారులకూ బాధ్యత ఉందని, దానిపై కూడా ఆయా సంఘాలతో చర్చించామన్నారు.

గిరి ప్రదక్షిణ కోసం రహదారి నిర్మాణం

సీతమ్మధారలో అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి కైలాసపురం మీదుగా ఎన్ఏడీ ముందున్న మారియట్ హోటల్ వరకు రహదారి విస్తరణకు రూ.34 కోట్ల పోర్టు నిధులు వెచ్చించడాన్ని ప్రశ్నించగా...అందులో పోర్టు స్వార్థం కూడా ఉందన్నారు. ప్రాథమికంగా సింహాద్రి అప్పన్న భక్తులు ఏటా గిరి ప్రదక్షిణ చేస్తున్నారని, ఆ సమయంలో రహదారులు కిక్కిరిసిపోతున్నాయని, వారి సౌకర్యార్థం ఆ మార్గం విస్తరణకు నిధులు కేటాయించామని చెప్పారు. అయితే దీనివల్ల ఆ ప్రాంతాల్లో ఉన్న పోర్టు భూముల విలువ కూడా పెరుగుతుందన్నారు.

పర్యావరణానికి పెద్దపీట

పోర్టు కాలుష్యం తగ్గించడానికి అన్నిరకాల చర్యలు చేపడుతున్నామని, లంకెలపాలెం, భీమిలి ప్రాంతాల్లో పోర్టుకు ఉన్న భూముల్లో భారీగా మొక్కల పెంపకం చేపడుతున్నామన్నారు. ఇదిలావుండగా ప్రస్తుతం 15 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా, దానిని 30 మెగావాట్లకు పెంచడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. విశాఖపట్నం బీచ్ కోతకు గురికాకుండా పటిష్ఠం చేయడానికి అవసరమైన నిధులు పోర్టు భరిస్తున్నదని, ఈ విషయంలో జీవీఎంసీ, జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. విశాఖపట్నం పోర్టు సామర్థ్యాన్ని పెంచడానికి 22 ప్రాజెక్టులు చేపట్టగా, వాటిలో నాలుగు పూర్తి కావచ్చాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

కోస్టల్ షిప్పింగ్‌కు ప్రోత్సాహం

విశాఖపట్నం పోర్టు నుంచి కోస్టల్ షిప్పింగ్‌ను ప్రోత్సహిస్తున్నామని, మొత్తం సరకు రవాణాలో ఇది 20 నుంచి 25 శాతం ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రైళ్ల ద్వారా 25 శాతం నుంచి 35 శాతం సరకు రవాణా జరుగుతోందన్నారు. రోడ్ నెట్‌వర్క్‌ను కూడా పెంచుకుంటున్నామని షీలానగర్-గాజువాక-అనకాపల్లి-పెందుర్తి మార్గాలను కూడా విస్తరిస్తున్నామని చెప్పారు. అదానీకి కేటాయించిన బెర్తును ప్రస్తుతం పోర్టు యాజమాన్యమే ఆపరేట్ చేస్తున్నదని, దాని ద్వారా గత రెండేళ్లలో రూ.80 కోట్ల వరకు ఆదాయం వచ్చిందన్నారు. అదానీ, వేదాంత సంస్థల వివాదాలు ఆర్బిట్రేషన్‌లో ఉన్నాయన్నారు.

వైసీపీలో అయోమయం

... 5వ పేజీ తరువాయి

వెతుక్కుంటున్నారు. వైసీపీ నగర అధ్యక్షుడిగా ఉన్న పంచకర్ల రమేష్‌బాబు మూడు నెలల కిందట హఠాత్తుగా పార్టీని వీడి జనసేన పార్టీలో చేరిపోయారు. కొద్దిరోజుల కిందట ఎమ్మెల్సీ వంశీకృష్ణశ్రీనివాస్ కూడా పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఆ తర్వాత రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ కూడా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించి లేఖను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పంపించారు. ఆయన టీడీపీలో చేరతారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇంకా ఏ పార్టీలో చేరలేదు. తాజాగా అనకాపల్లి జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు రత్నాకర్‌లు పార్టీకి రాజీనామా చేసి తన కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరిపోయారు. ఇప్పుడు తర్వాత వంతు ఎవరిదనే దానిపై పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు, ప్రజల్లో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. జిల్లాలోని ఒక నియోజకవర్గానికి చెందిన ఒక నేత టీడీపీతో సంప్రతింపులు జరపగా, సానుకూల స్పందన రాకపోవడంతో జనసేన వైపు చూస్తున్నట్టు తెలిసింది. అలాగే కొద్దిరోజుల కిందటి వరకూ ప్రాధాన్యం కలిగిన నామినేటెడ్ పోస్టులో కొనసాగిన నేత కూడా పార్టీని వీడిపోవడం ఖాయమని అంటున్నారు. ఏ పార్టీలోకి వెళతారనే దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వీరితోపాటు పశ్చిమ నియోజక వర్గానికి చెందిన మరో ముఖ్య నేత కూడా వైసీపీని వీడాలని దాదాపు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. దీనిపై తన అనుచరులతో ఇప్పటికే చర్చించినట్టు సమాచారం. ఆయన ఏ పార్టీలో చేరతారనే దానిపై సందిగ్ధత నెలకొంది. కానీ వ్యక్తిగత కారణాల వల్ల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేంత వరకూ అధికార పార్టీలోనే కొనసాగుతారని, ఆ తర్వాత రాజీనామా చేస్తారని అంటున్నారు. ఇదిలావుండగా పార్టీలో ద్వితీయశ్రేణి నాయకులు కూడా భారీగానే ఇతర పార్టీల్లోకి వలస వెళ్లిపోతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. తూర్పు, దక్షిణ నియోజకవర్గాల నుంచి దాదాపు పది మంది కార్పొరేటర్లు పార్టీకి గుడ్‌బై చెప్పేస్తారని వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఉత్తర నియోజకవర్గంలోని కార్పొరేటర్ ఒకరు తనకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి ఇస్తే జనసేనలో చేరతానని ఆ పార్టీ నేతల వద్ద షరతు పెట్టినట్టు తెలిసింది. పశ్చిమ నియోజకవర్గం టికెట్‌ను ఆనంద్‌కుమార్‌కు ఇస్తే తాను పార్టీని వీడిపోతానని అక్కడ ఒక కార్పొరేటర్ తన అనుచరులకు చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఇలా ఎవరు ఎప్పుడు పార్టీ నుంచి వెళ్లిపోతారో తెలియక వైసీపీ నేతలు, కార్యకర్తలుఅయోమయానికి గురవుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



కొండవాలు గ్రామాల్లో సమస్యలపై వినతి

కంచరపాలెం, జనవరి 3: జీవీఎంసీ 48వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో నెలకుని ఉన్న సమస్యలపై కార్పొరేటర్ గంకల కవిత బుధవారం కమిషనర్ సాయి కాంత్ వర్మను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బర్మాక్యాంప్, జైభారత్‌నగర్, ఇందిరానగర్, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టక స్థానికులు ఇబ్బంది పడుతున్నట్టు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రారంభించిన పనులు మధ్యలో నిలిపివేశారని వివరించారు. పలుచోట్ల వీధి దీపాలు లేక అంధకారం నెలకొంటోందన్నారు.ఈ కార్యక్రమంలో గంకల అప్పారావు పాల్గొన్నారు.

7న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం

డాబాగార్డెన్స్, జనవరి 3: ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ సదరన్ రీజియన్ అనుబంధంగా పనిచేస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశాన్ని ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు వీఎఫ్ఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ ఎల్‌బీ కాలేజీ ఆవరణలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నామన్నారు. ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చిస్తామన్నారు.

అరకు కాఫీకి అరుదైన గుర్తింపు

- 'వన్ డిస్ట్రిక్ట్...వన్ ప్రొడక్ట్' పేరిట కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో బంగారు పతకం కైవసం

పాడేరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో వివిధ జిల్లాల్లో ప్రాచుర్యం పొందిన ఉత్పత్తులకు 'వన్ డిస్ట్రిక్ట్...వన్ ప్రొడక్ట్' పేరిట ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అరకు కాఫీకి బంగారు పతకం లభించింది. జిల్లాల్లో ఓ ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులకు జనంలో మంచి గుర్తింపు ఉంటున్నది. దీంతో ఆయా ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో వున్న ప్రత్యేక ఉత్పత్తుల వివరాలను గత ఏడాది సెప్టెంబరులో సేకరించింది. అక్టోబరు నెలలో ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక ఉత్పత్తుల పరిశీలన జరిపింది. ఆ విధంగా గత ఏడాది అక్టోబరు 14న కేంద్ర బృందం సభ్యులు పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో పర్యటించి ఇక్కడ కాఫీ సాగు, తదితర వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావులను అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన 'వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్' ఎంపిక ప్రక్రియకు దేశవ్యాప్తంగా 64 ఉత్పత్తులు రాగా, వాటిలో 14 ఉత్పత్తులకు గుర్తింపు లభించింది. వాటిలో మన రాష్ట్రం నుంచి ఎంపికైన ఆరు ఉత్పత్తుల్లో అరకు కాఫీ ఒకటి కావడం విశేషం. మన్యం కాఫీకి బంగారు పతకం లభించింది. ఈ కార్యక్రమానికి జీసీసీ ఎండీ జి.సురేశ్‌కుమార్ హాజరై కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ నుంచి 'వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్' గుర్తింపు అవార్డును స్వీకరించారు.



అవార్డుతో జీసీసీ ఎండీ సురేశ్‌కుమార్

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి

డాబాగార్డెన్స్, జనవరి 3: అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలోని ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన విద్యార్థినులంతా ఓటు హక్కు పొందాలన్నారు. అతిథులు ఎస్‌డీసీ డిప్యూటీ కలెక్టర్ సీతారామమ్మూర్తి , మహారాణిపేట తహసీల్దార్ టి.ఆనందకుమార్, డిప్యూటీ తహసీల్దార్ పి.అప్పారావు మాట్లాడుతూ, ఓటరు ఐడీ ఏ విధంగా నమోదు చేసుకోవాలో వివరించారు. అధ్యాపకులు జి.జ్యోతి, బి.నాగమణి, శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి

చిరు వ్యాపారులపై పెందుర్తి ఏఎస్ఐ ప్రతాపం

- సమయం మించి దుకాణాలు తెరవడంపై ఆగ్రహం
- సిబ్బందిని చితకబాదిన వైనం.. బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు

పెందుర్తి, జనవరి 3: చిరువ్యాపారులపై పెందుర్తి ఏఎస్ఐ దాష్టీకం ప్రదర్శించారు. రాత్రి సమయంమించినా దుకాణాలు తెరిచి రోడ్డుపై వ్యాపారులు నిర్వహిస్తున్నారన్న నెపంతో టిఫిన్ బండి నిర్వాహకులు, హోటల్ సిబ్బందిపై ఏఎస్ఐ విచక్షణారహితంగా లాఠీతో చితక బాదారు. దీంతో ఆయనపై బాధితులు పెందుర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివి.. ఈ ఘటనపై బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. స్థానిక పోలీసుస్టేషన్ ఏఎస్ఐ మురహరి మంగళవారం నైట్‌రౌండ్స్ డ్యూటీ చేశారు. ఈక్రమంలో రాత్రి 11.30 గంటలు స మయంలో జంక్షన్ రోడ్డుని ఆనుకునిఉన్న మూడు టిఫిన్, భోజన హోటల్స్ తెరచికుని వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ఏఎస్ఐ అక్కడికి చేరుకుని వ్యాపార సమయం పూర్తవుతున్నా హోటల్స్ బంద్ చేయరా ? అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. పక్కపక్కనే ఉన్న హోటల్స్ సిబ్బం దిని కిందకులాగి, మెడపట్టుకుని తోసేశారు. షట్టర్లు దించేశామని, షాపులు మూసేస్తున్నామని సిబ్బంది బతిమిలాడిన ఏఎస్ఐ అసభ్యపదజాలంతో వారిని దూషించారు. అంతటితో ఆగకుండా లాఠీతో విచక్షణారహితంగా బాదారు. వీపు, మోకాలు, పాదాలు విరిగేలా దాడి చేసినట్లు బా ధితులు వాపోతున్నారు. మహిళా సిబ్బంది అని చూడకుండా వారిపైనా చేయిచేసుకున్నట్టు బాధితులు ఆరోపించారు. ఏఎస్ఐ అరాచకం అంతా హోటల్స్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీలో నమోదైంది.

గాయాలైన హోటల్ సిబ్బంది వెంటనే స్థానిక సీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడి వైద్యులు పోలీసు ఫిర్యాదు లేదని వైద్యం చేసేందుకు నిరాకరించారనిబాధితులు తెలిపారు. ఈ స్థితిలో బుధవారం ఉదయం హోటల్స్ యాజమానులు గాయపడ్డ సిబ్బందిని తీసుకువెళ్లినా వీలుకాదని చెప్పారు. దీంతో సీసీ ఫుటేజీలో పోలీసుల దాడి చూపించడంతో వైద్యులు గాయపడిన వారికి వైద్యం చేశారు. అనంతరం బాధితులు తవుడమ్మ, సతీశ్, మల్ల ప్రసాదరావుస్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ దాడిని ఆధారాలతో నగర పోలీసు కమిషనర్‌కు నివేదించామని శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ మరిడాన శ్రీనివాసరావు తెలిపారు.

కనకమహాలక్ష్మికి బంగారు ఆభరణాల బహూకరణ

జగదాంబ కూడలి, జనవరి 3: కనకమహాలక్ష్మి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సైరా అప్పాని 45 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు, గొలుసులు తదితర ఆభరణాలను ఈవోకె.శిరీషకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం ప్రత్యేకంగా చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.



ఈవోకు ఆభరణాలు అందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై వర్క్‌షాపు

సీతంపేట, జనవరి 3: మధురానగర్‌లోని టైనీ టోట్స్ పాఠశాలలో మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ వర్క్‌షాపును నిర్వహించారు. గురుగ్రామ్‌లోని లోటస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన పరిశోధక విద్యార్థిని ధృవికా రెడ్డి తన కమ్యూనిటీ ప్రాజెక్ట్ డియర్ జిందగీలో భాగంగా పలు అంశాలను వివరించారు. మాదక ద్రవ్యాలతో నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బస్సు యాత్ర విజయవంతం చేయాలి

అక్కయ్యపాలెం, జనవరి 3: పోర్టు ఆస్పత్రి రోడ్డులో ఈ నెల 6వ తేదీన జరగనున్న సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు కార్యకర్తలు నాయకులకు పిలుపునిచ్చారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానాలో సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అలాగే, సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జనవరి 3 : మధురవాడ 11 కేవీ హిల్ 1 విద్యుత్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 డీఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధురవాడ మెయిన్ రోడ్, భగవాన్‌దాస్ కాలనీ, ఎమ్మెస్సార్ లేఅవుట్, సాయిప్రియా లేఅవుట్, చంద్రంపాలెం, భాస్కర్ నగర్, సంపత్‌నగర్, ఉజ్వల ఆస్పత్రి ఏరియా,అయోధ్యనగర్, ఆర్టీసీ కాలనీ, మానం ఆంజనేయులనగర్, సాక్షి ప్రెస్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు విషయాన్ని గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

విరాట్ ఫెస్ట్ 2024 విజేతలు వీరే

ఎంవీపీ కాలనీ, జనవరి 3 : ఎంవీపీ కాలనీలోని అల్వార్‌దాస్ మైదానంలో విరాట్ ఫెస్ట్ 2024 పేరిట నిర్వహించిన క్రీడా పోటీల విజేతలను నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. ఈమేరకు వారు ప్రకటన విడుదల చేశారు. ఎన్‌వీపీ లా కళాశాల, సీఎంటీ, సిమ్స్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో త్రోబాల్ విజేతగా విరాట్ టీమ్ గెలుపొందింది. వాలీబాల్‌లో ఆదిత్య డిగ్రీ కళాశాల, క్రికెట్‌లో ఏపీఎస్ బృందం గెలుపొందాయి. ఆయా విభాగాల్లో రన్నర్స్‌గా సమతా కళాశాల, విరాట్ టీమ్, ఏయూ కళాశాల జట్లు నిలిచాయి.

ఎన్‌హెచ్‌ఎం క్యాలెండర్ ఆవిష్కరణ

మధురవాడ, జనవరి 3 : నేషనల్ హెల్త్ మిషన్ వైద్య ఆరోగ్య శాఖ క్యాలెండర్‌ను మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం నాయకులు వి. వీరబ్రహ్మం, గోపీనాథ్, పాల్గొన్నారు.

జనసేన క్యాలెండర్లు పంపిణీ

సాగర్‌నగర్, జనవరి 3 : రాష్ట్రాభివృద్ధి టీడీపీ, జనసేనతోనే సాధ్యమని జనసేన నేత శాఖరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం 8వ వార్డు తిమ్మాపురంలో ఆయన ఇంటింటికి జనసేన క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనం మార్పు కోరుకుంటున్నారని, వారి కష్టాలు తొలిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు.

అధ్వానంగా విద్యా వ్యవస్థ : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, జనవరి 3 : రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అధ్వానంగా ఉందనడానికి చోడవరంలో జరిగిన సంఘటనే నిదర్శనమని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.విద్యాలయం అంటే చదువుల తల్లి ఆలయమని, కానీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో విద్యార్థులు మద్యానికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి ఈ సంఘటన పరాకాష్టగా మారిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

అక్రమ కట్టడాలు తొలగింపు

సాగర్‌నగర్, జనవరి 3 : రుషికొండలో సర్వే నెంబరు 5/16 గ్రామ కంఠంలో అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలను జీవీఎంసీ పట్టణ ప్రణాళికా అధికారి శాస్త్రి ఆదేశాల మేరకు సిబ్బంది బుధవారం తొలగించారు. గతంలో ఈ స్థలంలో ఏపీ హౌసింగ్ బోర్డు 42 ఇళ్లు నిర్మించగా మిగిలిన భూమి ఆక్రమణకు గురైంది. సత్తిబాబు అనే వ్యక్తి ఆ స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో సిబ్బంది వాటిని తొలగించారు.

'బీసీ కార్పొరేషన్ నిర్వీర్యం'

పెదవాల్తేరు, జనవరి 3 : వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పెదవాల్తేరులోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఒక్క బీసీ రుణం కూడా ఇవ్వలేదన్నారు. పేరుకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క కార్పొరేషన్‌కు కూడా నిధులు ఇవ్వకుండా చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యులను అవమానించిందన్నారు. బీసీ విద్యార్థులకు విదేశీ విద్య రుణాలు ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

పిల్లలకు క్రమశిక్షణ అవసరం

మద్దిలపాలెం, జనవరి 3 : జీవీఎంసీ 22వ వార్డు వీఐపీ రోడ్డులోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో బుధవారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.విద్యార్థులకు వారి తల్లిదండ్రులనే టీచర్లను చేశారు. తరగతి గదిలో ఒక్కో సబ్జెక్టులోని ప్రశ్నలను తల్లిదండ్రులే తమ పిల్లలకు అడిగి వారి ప్రతిభ పాటవాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మళ్ల రాముసాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 24, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 54, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 52, బీరకాయలు 50, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 28, క్యాబేజ్ 20, క్యారెట్ 44, దొండకాయలు 36, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 100, బరబటి 50, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 44, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 38 , ఆగాకర 84, పొటల్స్ 56, కీరదోస 24, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 42, చిలగడదుంపలు 24 , కంద 50, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 80
ఫారం ధర	-- 100
విత్ స్కిన్	-- 170
స్కిన్‌లెస్	-- 180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

నిరుపయోగంగా ఎండాడ బస్టాప్

- పెట్రోల్ బంకు వద్ద ఆగని ఆర్టీసీ బస్సులు
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు



ఎండాడ పెట్రోల్ బంకు వద్ద నిర్మించిన బస్టాప్

ఎండాడ, డిసెంబరు 27 : జీవీఎంసీ ఎనిమిదో వార్డు ఎండాడ పెట్రోల్ బంకు సమీపంలో ఏర్పాటు చేసిన బస్టాప్ నిరుపయోగంగా ఉంది. అప్పటి ఎంపీ కంభంపాటి హరిబాబు మంజూరు చేసిన నిధులతో ఈ బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. కొత్తలో ఇక్కడ బస్సులు ఆగినా.. ప్రస్తుతం ఒక్క బస్సు కూడా ఆపడం లేదు. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. పెట్రోల్ బంకు వెనుక భాగంలో ఎక్కువగా అపార్టుమెంట్లు నిర్మించడంతో పాటు గణేష్‌నగర్, శాంతినగర్, వివేకానందనగర్, దసపల్లా లేఅవుట్‌తో పాటు సాగర్‌నగర్‌కి వెళ్లే వారికి ఈబస్టాప్ అనువుగా ఉండేది. పెట్రోల్ బంక్ చుట్టు పక్కల కాలనీలు పెరగడంతో దీనికి ప్రాధాన్యత పెరిగింది. జాతీయరహదారి కావడంతో ఎండాడ కూడలి సిగ్నల్ పాయింట్ నుంచి నేరుగా హైవేకి కుడివైపు వాహనాలు వెళుతుండంతో ఆర్టీసీ బస్సులు వెనుకాలే వస్తున్నాయి తప్ప స్టాప్ వద్ద ఆపడం లేదు. దీంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయమై ఎండాడ వివేకానందనగర్‌లో ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థులు ఇప్పటికే ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అయినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాప్‌లో బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల తీరుపై మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మధురవాడ, జనవరి 3 : సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికుల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. బుధవారం 7, 8 వార్డుల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కార్మికుల సమ్మె వల్ల వీధుల్లో పేరుకుపోయిన చెత్తను ప్రైవేటు సిబ్బందితో తొలగించడానికి జీవీఎంసీ జోనల్ కమిషనర్, ఆరోగ్య శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. వారిని సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పీఎంపాలెం పోలీసులు సమ్మెలో ఉన్న కార్మికులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. అధికారులు కార్మికులను అవమానపరిచేలా మాట్లాడారని సీఐటీయూ జోనల్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు అన్నారు. ఆరోగ్యాలను కూడా లెక్కచేయకుండా కార్మికులు పారిశుధ్య పనులు చేస్తారని, వారి న్యాయమైన కోర్కెల సాధన కోసం ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం కార్మికులు, సీఐటీయూ చెత్త కుప్పలపై కూర్చొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి పి. రాజ్‌కుమార్, సీహెచ్ శేషబాబు, కె. నాగరాజు, రామలక్ష్మి, రాంబాయి పాల్గొన్నారు.

అడివివరం రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

సింహాచలం, జనవరి 3 : అడివివరం వెళ్లే ప్రధాన రహదారిలో గాంధీనగర్ కూడలి వద్ద బుధవారం భారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం, వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న 98వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి సిబ్బందితో యుద్ధప్రాతిపదికన చెట్టును తొలగించారు. చెట్టు కూలిపోవడం వల్ల సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. గోపాలపట్నం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం

సింహాచలం, జనవరి 3 : పాత అడివివరంలోని భూలోకనగర్‌లో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నవంబరులో సింహాచలం బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్మాణంలో భాగంగా కాపువీధిలో ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించి, భూలోకనగర్‌లో ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ ఎవరూ పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటికి 40 రోజులు కావస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

వెంకోజీపాలెం, జనవరి 3 : ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ఎంవీపీ పోలీసులు బుధవారం సాయంత్రం హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో స్క్రీన్ ఏర్పాటు చేసి, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు.

16వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

వెంకోజీపాలెం, జనవరి 3 : జీవీఎంసీ 16వ వార్డు కృష్ణా కళాశాల ప్రాంతంలో టీడీపీ నాయకులు బుధవారం సాయంత్రం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు టీడీపీ అధికారంలోకి వస్తే అందించనున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, నాయకులు జి. అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అర్బన్ ఎంఈఓకి సన్మానం

పెదవాల్తేరు, జనవరి 3 : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరు ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాఠశాల ఆవరణలో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విశాఖ అర్బన్ ఎంఈఓ బాలామణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. రవి సిద్దార్థ, హెచ్‌ఎం వనిత, తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా అయోధ్య రాముని పూజాక్షతలు

పద్మనాభం, జనవరి 3 : పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయంలో అయోధ్య రాముని పూజాక్షతలను ప్రతి ఇంటికి అందించడానికి అనంత సేవా దళం సభ్యులు బుధవారం ప్యాకెట్లు తయారు చేశారు. పం చాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో సుమారు వెయ్యి ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పద్దు, పైడిరాజు, కృష్ణ, నారాయణ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో వృద్ధుల్లో ఆనందం : ఎంపీ ఎంవీవీ



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీ సత్యనారాయణ

సిరిపురం, జనవరి 3 : పింఛన్ల పెంపుతో వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వైసీపీ తూర్పు నియోజక వర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పాల్గొన్నారు.

భీమునిపట్నం/పద్మనాభం : ప్రజలకు సంక్షేమ పాలన అందాలంటే ముఖ్యమంత్రిగా జగన్ మళ్లీ రావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన భీమిలిలోని తోటవీధి సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం జీవీఎంసీ నిధులు రూ. 19.80 లక్షలతో చేపట్టనున్న నూకాలమ్మ గుడి స్టేజి పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలోనూ పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే 119 మందికి శాశ్వత భూహక్కు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపీపీ కె. రాంబాబు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఎంపీడీఓ ప్రభాకరరావు పాల్గొన్నారు.



గౌరీ శంకర్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

కిడ్నీ బాధితుడికి ఎమ్మెల్యే వెలగపూడి ఆర్థిక సాయం

ఎంవీపీ కాలనీ, జనవరి 3 : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదర్శనగర్ ఎస్సీ కాలనీలో ఉంటున్న ఒదురి గౌరీ శంకర్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈమేరకు అయన కిడ్నీల మార్పిడి శస్త్ర చికిత్స కోసం ఎమ్మెల్యేను ఆర్థిక సాయం కోరగా రూ. లక్ష అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చోడె పట్టాభిరాం, జీవీ రామచంద్రరావు, కాళ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్



వెంకోజీపాలెం, జనవరి 3 : బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్ షెల్లీ సాలిహిన్ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు విద్య, టూరిజం, కల్చరల్, వ్యాపార అభివృద్ధి, మెడికల్ తదితర అంశాలపై చర్చించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న బంగ్లాదేశ్ నూతన సంవత్సరం వేడుకలను ఏయూలో చదువు తున్న బంగ్లాదేశ్ విద్యార్థులు జరుపుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.

'పరీక్ష పే చర్చ' విజయవంతం చేయండి

పెదవాల్తేరు, జనవరి 3 : పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ సీనియర్ అధ్యాపకుడు గొట్టేటి రవి కోరారు. బుధవారం ఆయన ఈస్టు పాయింట్ కాలనీలోని కేడీపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు,విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నిర్వహిస్తున్న పరీక్షల విధానం వల్ల విద్యార్థులకు కలిగే లాభనష్టాలు, పరీక్ష విధానంలో మార్పులు, తదితర వాటిపై చర్చించాలన్నారు. ఇందుకు ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలను ప్రధాని మోదీకి నేరుగా పంపించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుమతి, పాల్గొన్నారు.

త్వరలో 'ప్రసాద్' పనులకు శంకుస్థాపన

సింహాచలం, జనవరి 3 : సింహగిరిపై కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న 'ప్రసాద్' పథకం పనులకు కేంద్ర పర్యాటక శాఖా మంత్రి కిషన్‌రెడ్డి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన సింహగిరి వర్తకుల కోసం రూ. 35 లక్షలతో చేపట్టిన తాత్కాలిక దుకాణ సముదాయాన్ని దేవస్థానం పాలక మండలి సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రసాద్ పథకం కింద వ్యాపారుల కోసం శాశ్వత ప్రాతిపదికన వాణిజ్య సముదాయాన్ని ఆరు నెలల్లో నిర్మించ నునున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్. శ్రీనివాసమూర్తి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలపై వినతి



స్వాతిరాణికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన కళాసీల వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

పెదవాల్తేరు, జనవరి 3 : జీసీసీ హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన కళాసీల వెల్ఫేర్ సొసైటీ (ఏఐటీయూసీ అనుబంధం) సభ్యులు వుడా పార్కు ఎదురుగా ఉన్న రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ కార్యాలయంలో జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీసీసీని నమ్ముకుని హమాలీలు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా.. కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు.ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబానికి దహన ఖర్చులు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు, హమాలీల సంఘం నాయకులు పండు బాబు, లగుడు సీతయ్యనాయుడు, సుబ్బారావు, స్వామి, ఎం. రాజబాబు, పి. పరశురాం, చందు, బలరాం, అల్లూరి సీతారామరాజు, రంప చోడవరం డివిజన్‌కు చెందిన 25 మంది హమాలీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

భీమునిపట్నం, జనవరి 3 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సావిత్రిబాయి పూలే జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని డైట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్, అధ్యాపకులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు సారిపల్లి త్రినాథరావు, పి. హారిణి, ఎం. మహాలక్ష్మి పాల్గొన్నారు. అంబేడ్కర్ కాలనీలో కేవీపీఎస్ ఆధ్వర్యంలోనూ సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



ఏయూలో జరిగిన వేడుకల్లో ఇన్‌చార్జి వీసీ సమత, తదితరులు

స్త్రీ విద్యా ప్రదాత : మేయర్

ఆరిలోవ : స్త్రీ విద్య కోసం ఎంతగానో కృషి చేసిన మహిళ సావిత్రిబాయి పూలే అని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. బుధవారం ఆమె బీసీ నాయకుడు రామన్న పాత్రుడు ఆధ్వర్యంలో హనుమంతవాక మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

మహిళా విద్యకు ఆధ్యురాలు

వెంకోజీపాలెం : మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి పూలే అని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య సమత అన్నారు. డాక్టర్ దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఏయూ పరిపాలనా భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీతో పాటు పలువురు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

వైసీపీ జిల్లా కార్యాలయంలో...

ఎండాడ : ఎండాడలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలోనూ సావిత్రిబాయి పూలే జయంతి జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆధ్వర్యంలో నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పూర్ణను మహిళా ఉపాధ్యాయం దినోత్సవం పురస్కరించుకుని 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు.

తగరపువలస : బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆర్. అప్పలరాజు ఆమె జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయినిగా విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, నాగమణి, మల్లిక పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున

విశాఖ వేలీ స్కూల్లో మెరుగైన వసతులు

- కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున

ఆరిలోవ. జనవరి 3 : విశాఖ వేలీ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ మల్లికార్జున నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం ఆయన పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన, అదనపు భవనాల నిర్మాణం, అడ్మిషన్ల ప్రక్రియ తదితర అంశాలపై కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల మేరకు అడ్మిషన్లు చేపట్టాలని, అదనపు భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. పిల్లల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని కొత్త బస్సులు సమకూర్చాలని చెప్పారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్. డీఈఓ చంద్రకళ, డీటీసీ రాజారత్నం, కమిటీ సభ్యులు డీఎస్ వర్మ, డీఎస్ఆర్ ప్రసాద్, సీఎం రవి ప్రసాద్, కె. హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే



మద్దిలపాలెం రోడ్డులో పేరుకుపోయిన చెత్త

మద్దిలపాలెం, జనవరి 3 : పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో ఎక్కడికక్కడే చెత్త పేరుకుపో తోంది. ముఖ్యంగా అపార్టమెంట్ల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అపార్టమెంట్ల ముందు ఏర్పాటు చేసిన డెస్ట్ బిన్లలో వ్యర్థాలు నిండిపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. 22,23వ వార్డుల్లోని మద్దిలపాలెంలో రోడ్లన్నీ దాదాపుగా చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. కార్పొరేటర్లు ఉంటున్న ప్రాంతాల్లో మాత్రమే చెత్తను వాహనాల్లో తరలిస్తున్నారు.మిగిలిన చోట్ల ఎక్కడి చెత్త అక్కడే ఉంది. డెస్ట్ బిన్లలో నిండిపోయిన వ్యర్థాలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేక స్థానికులు అవస్థలు పడుతున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, జనవరి 3 : వరాహ లక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను బుధవారం వైభవంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేసి,ధనుర్మాసోత్సవ ఆండాళ్ అమ్మవారి సేవాకాలం జరిపారు. అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. ఆగమశాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం రజిత గరుడ వాహనంపై గోవింద రాజస్వామిని ఉంచి భక్తుల గోత్రనామాలతో షోడశోపచారాలు సమర్పించారు.

వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు

సింహాచలం, జనవరి 3 : సింహగిరి కొండ దిగువన పూతోటలో ఉన్న పద్మావతీ, అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు తరువాత ఉత్సవమూర్తిని ఆండాళ్‌గా పెద్ద వాలుజాడ, కొప్పు, తదితర అలంకారాలతో తీర్చిదిద్దారు. ఉపచారాలు సమర్పించి అష్టోత్తర శతనామావళితో పూజ చేశారు. అనంతరం భక్తులతో కలిసి తిరుప్పావై పాశురాన్ని విన్నపం చేశారు.

బీఈడ్ మూడో సెమిస్టర్ పుస్తకం ఆవిష్కరణ

వెంకోజీపాలెం, జనవరి 3 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తెలుగు, సంస్కృత అకాడమీ ద్వారా బీఎడ్ విద్యార్థుల మూడవ సెమిస్టర్‌కు సంబంధించి ప్రచురించిన 'జీవశాస్త్ర బోధనాభ్యసన శాస్త్రం-2' పాఠ్య పుస్తకాన్ని ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ జయరాం కనకాల రచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, గౌరవ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఎమెరిటస్ ప్రొఫెసర్ పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఏఐయూ పరిశీలకుడు

వెంకోజీపాలెం, జనవరి 3 : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ పరిశీలకుడు డాక్టర్ మనీష్ జంగ్ర బుధవారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. సమతతో భేటీ అయ్యారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు ఏయూలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్-యువభేరిని డాక్టర్ మనీష్ పర్యవేక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో ఫెస్టివల్ కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎన్. విజయ మోహన్, ఆచార్య ఏ. పల్లవి పాల్గొన్నారు.

ఘనంగా శారదా మణిదేవి జయంతి

భీమునిపట్నం, జనవరి 3 : శివాలయం వీధిలో ఉన్న శారదా రామకృష్ణ సంఘంలో శారదా దేవి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ కూచిపూడి నృత్యా నిలయం మాస్టర్ ఆర్.కృష్ణవేణి ఈశ్వరి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస భక్తులు, ముమ్మిడిశెట్టి సత్యానందరావు, కొత్త రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మజ్జివలసలో 'వికసిత్ భారత్'

భీమునిపట్నం (రూరల్), జనవరి 3 : మజ్జివలస గ్రామంలో బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ జానకి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బంగారునాయుడు, సర్పంచ్ ఆదిలక్ష్మి, బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్, బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన ర్యాలీ



ఆర్డీవో కార్యాలయం అధికారులకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ సభ్యులు

భీమునిపట్నం, జనవరి 3 : సమగ్ర శిక్ష ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతిరావు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం గంటస్తంభం, మెయిన్ రోడ్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జాయింట్ సెక్రటరీ త్రినాథరావు, సీఆర్‌పీల ఉద్యోగుల సంఘం నాయకులు గౌరమ్మ, శివదయాల్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పద్మనాభంలో పశుగ్రాసం కొరత

పద్మనాభం (రూరల్), జనవరి 3 : మండలంలో పశుగ్రాసం కొరత నెలకొంది. ఈ ఏడాది పంటలు పూర్తిగా దెబ్బతినడంతో పశువులకు ఎండు గడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. ఎక్కడైనా ఉన్న విపరీతమైన డిమాండ్ ఉంది. ట్రాక్టర్ గడ్డి లోడు రూ.ఐదు వేలు పలుకుతోంది. ట్రాక్టర్‌తో గడ్డి తరలించడానికి కూలీల ఖర్చు అదనంగా మరో రెండు వేల రూపాయలు అవుతోంది. దీంతో పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గడ్డి కొనే స్తోమత లేక కొందరు మూగజీవాలను సంతల్లో విక్రయిస్తున్నారు.